Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 182 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 25 - 2 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## రూ.12,236 కోట్లతో రైల్, మెట్రో, ఎయిర్ పోర్ట్ ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం



**న్యూఢిల్లీ:** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నూతన పీఎంఓ బిల్డింగ్ సేవా తీర్థ్‌లో మంగళ వారం నాడు మంత్రి వర్గం సమావేశమైంది. కేరళ పేరు మార్పుతో సహా పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. సమావేశానం తరం ఆ వివరాలను కేంద్ర మంత్రి అశ్వని వైష్ణవ్ మీడియాకు తెలిపారు. కేరళ పేరును కేరళంగా మార్చే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, పేరు మార్పు బిల్లును రాష్ట్ర అసెంబ్లీ ఆమోదానికి పంపుతామని మంత్రి తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తరువాత బిల్లును పార్ల మెంటులో ప్రవేశపెడ తామని చెప్పారు.

**మరిన్ని కీలక నిర్ణయాలు**

రూ. 12,236 కోట్ల అంచనా వ్యయంతో మౌలిక సదుపాయాలు, విధానపరమైన నిర్ణయాలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిలో రైల్వేలు, అర్బన్ ట్రాన్‌పోర్ట్, ఏవియేషన్, మౌలిక సదు పాయాల కల్పన వంటివి ఉన్నాయి. విద్యుత్ రంగం సంస్కరణలపై కూడా విధానపరమైన నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ. 5.236 కోట్ల అంచనా వ్యయంతో గోండియా–జబల్‌పూర్ రైల్వే లైను డబ్లింగ్ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.2,668 కోట్ల పెట్టుబడితో పునరాఖ్–కియుల్ మధ్య 3, 4వ రైల్ లైన్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. రూ.1,168 కోట్ల అంచనా వ్యయంతో గమారియా–చాందిల్ మధ్య 3,4వ రైల్వే లైన్ నిర్మా ణానికి, రూ. 1,667 కోట్లతో శ్రీనగర్‌లో కొత్త ఇంటిగ్రేటెడ్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌కు సమ్మతి తెలిపింది. రూ.1,067 కోట్లతో అహ్మదాబాద్ మెట్రో ప్రాజెక్టు ఫేజ్–2బి విస్తరణకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదు : ఏపీ హోంమంత్రి అనిత

**అమరావతి, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని, ఎవరైనా సరే ఆడబిడ్డల జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపై శాసన మండలిలో చర్చ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లా డారు. సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యల వల్లే 20 నెలల్లో రాష్ట్రంలో నేరాలు 6.6 శాతం తగ్గాయని, పోక్సో కేసులు 8 శాతం, మహిళలపై హత్యలు 45 శాతం, సామూహిక అత్యాచా రాలు 64 శాతం తగ్గాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో శాంతి భద్రతలు లేవు కాబట్టే పెట్టుబడులు, పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని, బయటకు వచ్చిన మహిళ తిరిగి ఇంటికి వెళు తుందో లేదో తెలియని దుస్థితి ఉండేదని అనిత విమర్శించారు. గత ప్రభుత్వం ప్లాన్ ఆఫ్ ఆక్షన్ ఇవ్వకపోవడం వల్ల రూ. 180 కోట్ల కేంద్ర నిధులు కోల్పోయామని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. ఇటీవల టీడీపీ ఎమ్మెల్యే ఇంట్లో దొంగతనం కేసులో వైసీపీ గ్రామ సర్పంచ్ అరెస్టయ్యారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ప్రస్తుత ప్రభుత్వం రాజకీయాల కోసం వాడకోవడం లేదని, అందు వల్లే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 25 శాతం తగ్గాయని అనిత పేర్కొన్నారు. గంజాయి,



డ్రగ్స్ నివారణకు ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తున్నామని, ఇప్పటివరకు 96,940 కేజీల గంజాయి సీజ్ చేశామని తెలిపారు. అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబోలేటరీ భవన నిర్మాణాన్ని జగన్ ఆపేశారని, తాము ఫోరెన్సిక్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 'రప్పా.. రప్పా.. నరుకు తాం' అని శాంతిభద్రతలకు భంగం కలిగిస్తూ రెచ్చగొట్టేలా మాట్లా డితే కేసు ఫైల్ చేశామని, వైసీపీ కార్యకర్తలు అసభ్యంగా మాట్లాడితే దాన్ని జగన్ సమర్థించడం దారుణమని అన్నారు. గీత దాటి రెచ్చగొడుతూ మాట్లాడినా చూస్తూ ఊరుకునేందుకు ఇక్కడ సీఎంగా ఉన్నది జగన్ కాదని, చంద్రబాబు అని అనిత పేర్కొ న్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు చేసిన ఆరాచకాల ఫలితంగానే వారు 151 నుంచి 11 సీట్లకు దిగజారారని విమర్శించారు.

## గుబులు రేపుతున్న బర్డ్ ఫ్లూ

### - సరిహద్దు చెక్‌పోస్ట్‌లో ప్రత్యేక పర్యవేక్షణ




**చెన్నై:** ఆంధ్ర రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ ప్రబలుతోందని వస్తున్న వార్తలతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద పర్యవేక్షణ తీవ్రతరం చేశారు. చిత్తూరు, తిరుపతి తదితర జిల్లా ల్లోని 50కి పైగా గ్రామాల్లో బర్డ్‌ఫ్లూతో వందలాది కోళ్లు మృతి చెందుతున్నట్లు అందిన వార్తలతో.. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు, ఆంధ్ర–తమిళనాడు సరిహద్దుల్లోని చెక్‌పోస్ట్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి- పొన్ పాడి, ఊత్తుకోట–పెరియపాళయం, గుమ్మిడిపూండి- పొత్తికుళం తదితర మూడు ప్రాంతాల్లోని చెక్ పోస్టుల వద్ద వారం రోజులుగా పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి వచ్చే సరుకు ఆటోలు, వ్యాన్, లారీ తదితర వాహనాల్లో గుడ్లు, కోళ్లు, కోళ్ల దాణా తదితరాలు తీసుకొచ్చే వాహనాల టైర్లకు క్రిమినాశిని మందులు పిచికారీ చేసిన అనంతరం రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు. బర్డ్ ఫ్లూ బాధిత ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను వెనక్కి తిప్పి పంపుతున్నారు.

## వాళ్లు ఎవరికీ భయపడని బబ్బర్ షేర్స్.. రాహుల్ కితాబు

**భోపాల్:** ఢిల్లీలోని భారత్ మండపంలో ఫిబ్రవరి 10న జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో చొక్కాలు విప్పి నిరసనలు తెలిపిన ఇం డియన్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టుల పర్వం కొనసాగు తోంది. దేశ ప్రతిష్టను దిగజార్చే చర్చలకు కాంగ్రెస్ పాల్పడిం దంటూ ఈ ఘటనపై బీజేపీ విమర్శలు గుప్పిస్తుండగా, తాజాగా ఐవైసీ కార్యకర్తలకు సమర్థనగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడారు. ఐవైసీ కర్యకర్తలను అత్యంత ధైర్యవంతులైన సింహాలుగా అభివర్ణించారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరికీ భయపడాల్సిన పని లేదన్నారు. 'షర్ట్‌లెస్' నిరసనలకు సంబంధించి యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఢిల్లీ పోలీసులు మంగళవారం నాడు అరెస్టు చేశారు. తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో 15 గంటలకు పైగా విచారణ జరిపి అరెస్టు చేశారు. అనంతరం ఆయ నకు పాటియాల హౌస్ కోర్టు నాలుగు రోజుల కస్టడీ విధించింది. కాంగ్రెస్ నిరసనలకు ప్రధాన సూత్రధారి చిబ్ అని, ఇది జాతీయ భద్రత, దేశ సార్వ భౌమాధికారం, సమగ్రతకు చెందని కేసు అని పోలీసులు చెబుతున్నారు. దీనిపై భోపాల్‌లో జరిగిన కిసాన్ మహా చౌపల్‌లో రాహుల్ గాంధీ స్పందించారు. 'యూత్ కాంగ్రెస్ సభ్యు లంతా బబ్బర్ షేర్‌లు. మీరు ఎవరికీ భయపడాల్సిన పని లేదు. మీలో దేశభక్తి రక్తం ఉంది. మీరు హరిత విప్లవం తీసుకువచ్చారు. పరిశ్రమలు తీసుకొచ్చారు. ఐటీ విప్లవం తెచ్చారు. వీటన్నింటికీ మోదీ చరమగీతం పాడారు' అని రాహుల్ అన్నారు.

## సీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు : సీఎం చంద్రబాబు నాయుడు



**అమరావతి, (రాజధాని వార్తలు):** గత వైసీపీ పాలనలో ఎన్నో విధ్వంసాలు చూశామని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఏపీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. దేవాలయాలపై దాడులు జరిగాయని ప్రశ్నిస్తే కేసులు పెట్టారన్నారు. రాముడి విగ్రహం ధ్వంసం చేశారని ప్రశ్నిస్తే తనపైనే దాడికి దిగారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రక్షాళన కోసం ఈవోను నియమించామని చెప్పారు. తన దృష్టికి వచ్చిన నేషనల్ డైయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (చీణణదీ) రిపోర్ట్ వివరాలు వెల్లడిం చానని తెలిపారు. శ్రీవారి లడ్డూ విషయంలోనే కాదు.. అనేక విషయాల్లో తప్పు చేశారంటూ వైసీపీ నేతలపై ఆయన మండిప డ్డారు. కుట్ర కోణాన్ని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. 59.71లక్షల కేజీల రసాయనాలతో కూడిన నెయ్యిని లడ్డూ తయారీలో వినియోగించారని వివరించారు. తద్వారా రూ. 234.51 కోట్ల అక్రమాలకు పాల్పడ్డారంటూ వైసీపీ అగ్రనేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ల్యాబ్‌ల కళ్లుగప్పి నెయ్యి టెండర్లు దక్కించుకున్నారని విమర్శించారు. 2019 – 24 మధ్య రసాయనాలతో తయారు చేసిన నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారు చేశారని పేర్కొన్నారు. అధికారులు, నిపుణులు అందరూ కలిసి కుట్రలు చేశారని సీఎం చంద్రబాబు గణాంకా లతో సహా వివరించారు. 2026 జనవరి 23న ఈ కల్తీ లడ్డూ వ్యవహారంలో సీబీఐ చార్జ్‌షీట్ వేసిందని గుర్తు చేశారు. అలిపిరి ఘటనలో శ్రీవేంకటేశ్వర స్వామివారే తన ప్రాణాలను కాపాడారని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. కల్తీ నెయ్యి వినియోగం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు సిట్ వేయాలని ఆలోచించినట్లు ఏపీ సీఎం తెలిపారు. సిట్ ఏర్పాటును వైసీపీ నేతలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారని గుర్తు చేశారు. రాజకీయ వివాదం ఉండొద్దనే కేంద్ర, రాష్ట్ర అధికారులతో సిట్ ఏర్పాటు చేశామని వివరించారు. సీబీఐ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీం సూచించిందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీబీఐ రిపోర్టు పంపిందని పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు రద్దు చేసిందని గుర్తు చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని చెప్పినందుకే ఏకసభ్య కమిటీ అని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సీబీఐ రిపోర్టుతోపాటు ఫోరెన్సిక్ ఆధారాలను ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. 2020 జనవరి, ఫిబ్రవరిలో టెండర్ల నిబంధనలు మార్చారని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు సైతం వారు తిలోదకాలి చ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 మేలో భోలేబాబా సంస్థపై ఫిర్యాదు, విచారణకు ఆదేశించారన్నారు. 2022 ఆగస్టులో బీటా సిటోస్టిరాల్‌తో రసా యనాలు కలిశాయని నివేదిక వచ్చిందని చెప్పారు. CFTRI ల్యాబ్ రిపోర్ట్ వస్తే.. దానిని సైతం తొక్కిపెట్టార న్నారు. 2024 జులై 23న NDDB రిపోర్ట్ వచ్చిందని.. అందులోని అంశాలనే భగవంతుడు తనతో చెప్పించాడని సీఎం చంద్రబాబు తెలిపారు. జంతు కొవ్వు కలిసిందని తాను సొంతంగా చెప్పలేదని స్పష్టం చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేయాలన్న నిబంధనను సైతం తొలగించారన్నారు. 2019 ఆగస్టులో టెండర్ నిబంధనల్లో సడలింపు చేశారని చెప్పారు. టర్నోవర్, పాల సేకరణ సామర్థ్యాన్ని కూడా తగ్గించారని పేర్కొన్నారు. 2020 జనవరిలో శ్రీ వైష్ణవి ప్లాంట్‌ను తనిఖీ చేసి.. ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి సరఫరాకు అనుమతి ఇచ్చారన్నారు. కేజీకి రూ.329 చొప్పున భోలేబాబాకు నెయ్యి సరఫరా ఆర్డర్ ఇచ్చారని పేర్కొ న్నారు. 2022 జూన్‌లో ఫతేపూర్‌లోని భోలేబాబా ప్లాంట్ తనిఖీ చేసి.. డబ్బులు ఇవ్వలేదని ఆ సంస్థపై అనర్హత వేటు వేశారని సీఎం చంద్రబాబు చెప్పారు. ఒక పథకం ప్రకారం తిరుమల పవిత్రతను దెబ్బ తీసేందుకు కుట్ర చేశారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. తిరుమలకు ఏ మతస్థులైనా రావొచ్చునని.. అన్యమతస్థులు శ్రీవారి దర్శనానికి వస్తే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అధికారంలో ఉన్నామని నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని చెప్పారు. టెండర్ నిబంధనలను పూర్తిగా గాలికొదిలేశారన్నారు. నాటి టీటీడీ బోర్డు చైర్మన్ పీఏ చిన్న అప్పన్న లంచం తీసుకుని దొరికిపోయారని చెప్పారు. ఇవన్నీ నాటి టీటీడీ చైర్మన్, బోర్డుకు తెలిసే జరిగాయని తెలిపారు. నాడు లడ్డూలో నాణ్యత తగ్గిపోయిందని చాలా ఆరోప ణలు వచ్చాయని గుర్తు చేశారు. కల్తీ నెయ్యి తయారీకి ముఠాగా ఏర్పడ్డా రని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. నాటి టీటీడీ చైర్మన్ పీఏ చిన్నప్పన్న రూ.4.5 కోట్ల లంచం తీసుకున్నారన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో టెండర్లు దక్కించుకుని రసాయనాల నెయ్యి సరఫరా చేశారని తెలిపారు. కల్తీ నెయ్యి తయారీకి వివిధ రకాల రసాయ నాలు వినియోగించినట్టు దర్యాప్తులో తేలిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

## మంత్రి లోకేష్ పనితీరును ప్రశంసించిన హైకోర్టు

**అమరావతి, (రాజధాని వార్తలు):** విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పనితీరును ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రశంసించింది. కస్తూర్బా పాఠశాలల సమస్యలపై మంత్రి వేగంగా స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమని ధర్మాసనం పేర్కొంది. సుమోటో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. విద్యా రంగంలో సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి చురుగ్గా వ్యవహరిస్తున్నారని కోర్టు ప్రశంసించింది. ధర్మాసనం ముందు విచారణ సందర్భంగా మంత్రి లోకేష్ ఇటీవల చేసిన ప్రకటనలను కోర్టు ప్రస్తావించింది. ముఖ్యంగా కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ)లో పని చేస్తున్న టీచర్ల జీతాలను పెంచడం, ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయను న్నట్లు ప్రకటించడం సానుకూల చర్యగా అభివర్ణించింది. విద్యా రంగంలో సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి చురుగ్గా వ్యవహరిస్తున్నారని కోర్టు ప్రశంసించింది. ఇటీవల కస్తూర్బా వసతి గృహంలో విద్యార్థినులను ఎలుకలు కొరికిన ఘటనపై మంత్రి తక్షణమే స్పందించి చర్యలు చేపట్టిన విషయాన్ని కూడా




ధర్మాసనం గుర్తు చేసింది. విద్యార్థుల భద్రత, సంక్షేమంపై మంత్రి చూపిన చొరవను కోర్టు అభినందించింది. అయితే మంత్రి ఆ స్థాయిలో పనిచేస్తుంటే అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. విద్యార్థుల భద్రత, పాఠశాలల నిర్వహణపై ప్రభుత్వం, అధికారులు సమన్వ యంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.

## పాలు కలుషితం అవడానికి కారణం ఏంటో చెప్పిన డీఎస్పీ దేవకుమార్

**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజమండ్రి కల్తీ పాల ఘటనపై విచారణ అధికారి కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ విచారణ చేప ట్టారు. పాల వ్యాపారి అడ్డాల గణేష్ నిర్వహిస్తున్న వరలక్ష్మి డెయి రీని సీజ్ చేశారు. డీఎస్పీ దేవకుమార్ ఎబీఎన్‌తో మాట్లాడుతూ.. పాల వ్యాపారి గణేష్‌పై క్రైమ్ నెంబర్ 90/2026 కేసు నమోదు చేశామని తెలిపారు. నిందితుడిపై 105, 275 బీఎన్ఎస్ సెక్షన్లు నమోదు చేశామని వెల్లడించారు. పాల వ్యాపారి గణేష్ వరలక్ష్మి మిల్క్ డెయిరీని అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నాడని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, లాభాపేక్షతో పాలల్లో నీళ్లు కలిపి ప్రజలకు పోసేవాడని చెప్పారు. ఈ నెల 14వ తేదీన పాలు తక్కువగా సేకరించడం వల్ల పాలు చిక్కగా కనిపించేందుకు యూరియా, డిటర్జెంట్ పొడి, నూనె వంటి పదార్థాలు కలిపి కల్తీ చేశాడన్నారు. కల్తీ చేసిన పాలను ఫ్రిజ్‌లో నిల్వ చేయడం వల్ల కూలెంట్ ఆయిల్ లీకై పాలు కలుషితమయ్యాయని తెలిపారు. అందువల్లే పాలు చేదుగా ఉన్నాయన్నారు.

**ఐదుకు చేరిన మృతుల సంఖ్య..**

కల్తీ పాల ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ఆదివారం వరకు ఇద్దరు మృతి చెందగా.. సోమవారం మరో ముగ్గురు చనిపోయారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాధాకృష్ణమూర్తి, ఎన్ శేషగిరి రావు, తాడి రమణి మృతి చెందారు. మరికొంతమంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్ స్పందించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి ఖర్చులను ఏపీ ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారు వైద్యులను వెంటనే సంప్రదించాలని వీర పాండ్యన్ సూచించారు.

# దళిత వాడలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం నేతలు



**మందడం, (రాజధాని వార్తలు):** మందడం దళిత వాడలో పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం నేతలు వై నేతాజీ, ఎం రవి రాజధానిలోని మందడం దళితవాడ ప్రజలకు మంచినీరు సక్రమంగా సరఫరా చేయాలి పంచాయతీ అధికారులు, సి ఆర్ డి ఏ, ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు సమన్వయంతో మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని సిపిఎం డిమాండ్. రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న మందడం దళితవాడలోని లైబ్రరీ సెంటర్ వీధిలో పైపులైన్లు ద్వారా మంచినీరు సక్రమంగా రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన మంచినీటి పైపులను రిపేర్లు చేయించి సక్రమంగా దళితవాడ ప్రజలకు మంచినీరు అందేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి డిమాండ్ చేశారు. మందడంలో పూర్వకాలంలో వేసిన వాటర్ పైపులైన్లు పాడైనా నేపథ్యంలో వాటి స్థానంలో కాంట్రాక్టర్ ద్వారా కొత్త పైపులైన్లను వేయించారని అన్నారు. అధికారుల సమన్వయ లోపంతో కొత్త పైపులైన్ ల ద్వారా నీటి సరఫరా ఇప్పటివరకు ప్రారంభించలేదని అన్నారు వెంటనే కొత్త పైప్ లైన్ల ద్వారా మంచినీటి సరఫరా చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సిపిఎం నేతల దృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాజధాని డివిజన్ నాయకులు కుంభ ఆంజనేయులు గడ్డం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీనరీ నిర్వహణకై నూతన వాహనం అందజేత

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఏపిసిఆర్‌డిఏ పరిధిలో గ్రీనరీ నిర్వహణకై నూతన వాహనం అందజేసిన కమిషనర్ కె.కన్న బాబు ఐ.ఏ.ఎస్. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ అమరావతితో పాటు రాజధాని రీజియన్ పరిధిలోని మొక్కల పెంపకం మరియు గ్రీనరీ నిర్వహణ కోసం నూతన వాహనాన్ని సోమవారం సంబంధిత అధికారులకు అందజేసింది. నర్సరీ, పచ్చదనం నిర్వహణ కార్యక్రమాల నిమిత్తం 36 హెచ్‌పి ట్రాక్టర్‌ను తాజాగా సిఆర్డిఏ కొనుగోలు చేసింది. సిఆర్డిఏ కమిషనర్ కె.కన్నబాబు ఐఏఎస్ సంబంధిత అధికారులకు రాయపూడిలో సిఆర్‌డిఏ ప్రధాన కార్యాలయంలో కొత్త వాహనం యొక్క తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వాహనానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజారాజధాని అమరావతితో పాటు ఏపిసిఆర్‌డిఏ రీజియన్ పరిధిలో పచ్చదనం పెంపొందించేందుకు సిఆర్డిఏ కట్టుబడి ఉందని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్డిఏ ల్యాండ్ స్కేప్ & ఎన్విరాన్‌మెంట్ విభాగ అడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ బి.జాన్ బెన్నీ, హార్టికల్చర్ అధికారి ఏ.శివరామకృష్ణ పాల్గొన్నారు.




# పార్సిల్ బుకింగ్ సౌకర్యాలను ప్రారంభం

**(రాజధాని వార్తలు):** భారత తపాలా శాఖ ప్రజల సౌకర్యార్థం క్రింద తెలిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 11 ముఖ్య నగరాలలో 24×7 స్పీడ్ పోస్టు మరియు పార్సెల్ బుకింగ్ సౌకర్యాలను ప్రారంభించినట్లు తెలియజేస్తోంది. 1. విశాఖపట్నం, 2. విజయవాడ, 3. గుంటూరు, 4. నెల్లూరు, 5. కర్నూలు, 6. రాజమండ్రి, 7. తిరుపతి, 8. కడప, 9. అనంతపురం, 10. ఒంగోలు, 11. గుంతకల్ పైన పేర్కొన్న 11 నగరాలకే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇతర 242 ప్రధాన పట్టణ తపాలా కార్యాలయాలలో కూడా ప్రజల సౌకర్యార్థం సాధారణ పని వేళలను 1 నుండి 2 గంటల వరకు పొడిగించడం జరిగింది. దీనివల్ల కస్టమర్ల రద్దీ తగ్గి, సేవల నాణ్యత మరింత మెరుగుపడనుంది. ప్రజలు మరియు వ్యాపార సంస్థలు, పై పేర్కొన్న 11 నగరాలలో అందుబాటులో ఉన్న 24×7 బుకింగ్ సౌకర్యాలను అలాగే ఇతర 242 తపాలా కార్యాలయాలలో పొడిగించిన పని వేళలను తమ సౌకర్యానుసారం వినియోగించుకోవాలని కోరడమైనది.


# నాలుగు రోజుల ఉత్సాహం, ఉల్లాసం

**- విఐటి-ఏపీ విశ్వవిద్యాలయంలో విటోపియా 2026 ఘనంగా ముగింపు**








**అమరావతి, (రాజధాని వార్తలు):** 2026: విఐటి-ఏపీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వార్షిక క్రీడా మరియు సాంస్కృతిక మహోత్సవం 'విటోపియా 2026' నాలుగు రోజుల పాటు ఉత్సాహభరితమైన పోటీలు, ఉల్లాసకరమైన ప్రదర్శనలతో ఘనంగా ముగిసింది. ఈ నాలుగు రోజుల మహోత్సవం విశ్వవిద్యాలయం అంతటా విద్యార్థులను ఒకచోట చేర్చి, ప్రతిభ, సృజనాత్మకతను ప్రతీకగా నిలచింది. ఫిబ్రవరి 24, 2026న జరిగిన చివరి రోజు, వివిధ సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు తమ తుది ప్రదర్శనలకు సిద్ధమై, అనేక కళారంగాల్లో అసాధారణ ప్రతిభను, ఆసక్తిని ప్రదర్శించారు. ఫిబ్రవరి 23, 2026 సాయంత్రం నిర్వహించిన ప్రో-షోలో ప్రముఖ కళాకారులు దర్శన్ రావల్, మక్కా బ్యాండ్ మరియు డీజే తేరిమీకో సంగీత ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. ఫిబ్రవరి 24, 2026న జరిగిన ప్రో-షోలో శాస్త్రీయ సంగీత త్రయం మోహన సిస్టర్స్, పినాపిల్ ఎక్స్ప్రెస్, డీజే పృథ్వీ సాయి మరియు బ్యాండ్ సర్కిల్స్ ప్రదర్శనలు అందరిని అలరించాయి. సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలతో పాటు, విద్యార్థులు పిల్లో ఫైట్, సాక్ రేస్, విస్పర్ చాలెంజ్, మ్యూజికల్ చెయర్స్, బెలూన్ బర్స్ట్, ఆర్చరీ, రింగ్ టాస్ వంటి వినోదాత్మక కార్నివాల్ ఆటల్లో ఉత్సాహంగా పాల్గొని, పండుగ వాతావరణానికి మరింత ఆనందాన్ని జోడించారు. ఈ కార్యక్రమానికి విఐటి-ఏపీ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా॥ పి.అరుల్మొళివర్మన్, రిజిస్ట్రార్ డా॥ జగదీష్ చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ డా.ఎస్.గోపీకృష్ణన్, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డా॥ ఖదీర్ పాషా, ఫిసికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా॥రామచంద్రరావు తదితర అధ్యాపకులు, విద్యార్థులు, ప్రత్యేక ఆహ్వానితులు, విశిష్ట అతిథులు మరియు సిబ్బంది హాజరయ్యారు.

# 500కి పైగా ఉద్యోగాల భర్తీకై ఈ నెల 26న తుళ్లూరులో జాబ్ మేళా

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి & శిక్షణ శాఖ, ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సమన్వయంతో అమరావతి, తుళ్లూరులోని స్కిల్ హబ్ కార్యాలయంలో APCRDA జాబ్ మేళాను నిర్వహిస్తోంది. రాజధాని ప్రాంతంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ జాబ్ మేళా 26-02-2026 తేదీన ఉదయం 10 గంటల నుండి తుళ్లూరులోని APCRDA స్కిల్ హబ్ కార్యాలయంలో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సాండ్‌స్పేస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, మాస్కాఫ్ టెక్నాలజీస్, ECOMAC కన్‌స్ట్రక్షన్ కెమికల్ మాన్యుఫ్యాక్చరర్, ఎస్‌బిఐ కార్డ్స్ - Innovsource సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్., ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (టాటా ఎలక్ట్రానిక్స్), క్వెస్ కార్ప్ లిమిటెడ్ వంటి సంస్థలు పాల్గొంటున్నాయి. ఈ జాబ్ మేళా ద్వారా ఐటీ, డిజిటల్ మార్కెటింగ్, కన్‌స్ట్రక్షన్, బ్యాంకింగ్, ఎలక్ట్రానిక్స్ తయారీ, టెక్నికల్ ఫీల్డ్ సర్వీసెస్ వంటి విభాగాల్లో 500కు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడం జరుగుతుంది. జాబ్ మేళాలో కింది పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుంది. జావా ఫుల్ స్టాక్ డెవలపర్, డిజిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, రియాక్ట్ నేటివ్ డెవలపర్, ఎస్ఏపి ప్రొఫెషనల్స్, మార్కెటింగ్ & సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫ్యాక్టరీ సూపర్‌వైజర్, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, టీం లీడర్లు, టెలికాలర్లు, రిలేషన్‌షిప్ మేనేజర్, బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్, జూనియర్ టెక్నీషియన్, ఎలక్ట్రిసిటీ మీటర్ ఇన్‌స్టాలర్ మొదలైనవి. 10వ తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు. ఫ్రెషర్స్ & ఉద్యోగ అనుభవం ఉన్నవారికి సైతం అవకాశాలు ఉన్నాయి. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు విజయవాడ, అమరావతి, గుంటూరు, మంగళగిరి, విశాఖపట్నం, హోసూరు, తమిళనాడు తదితర ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ తదితర గుర్తింపు పత్రాలు, బయోడేటాతో జాబ్ మేళాకు హాజరు కావాలి. పూర్తి వివరాల కోసం తమ గ్రామంలోని జ=ణూ ఫెసిలిటేటర్‌ను సంప్రదించవచ్చు లేదా శ్రీకర్ 9963425999 నంబర్‌కు కాల్ చేయవచ్చు. అమరావతి & పరిసర ప్రాంత యువతకు ఉపాధి యువతకు వారి నైపుణ్యాల ఆధారంగా కల్పించేందుకు ఈ జాబ్ మేళాలను APCRDA నిర్వహించడం జరుగుతోంది.

# లోక్ భవన్‌లో అరుణాచల్ ప్రదేశ్, మిజోరం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు














**విజయవాడ, (రాజధాని వార్తలు):** 'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం లోక్ భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన అరుణాచల్ ప్రదేశ్ మరియు మిజోరం రాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ, అరుణాచల్ ప్రదేశ్ అందమైన పర్వతాలు, భౌద్ధ మఠాలు, సరస్సులు మరియు సంస్కృతికి ప్రసిద్ధి చెందిన రాష్ట్రం అని చెప్పారు. మిజోరం రాష్ట్రంలో భారతదేశంలో అత్యధిక సంఖ్యలో తెగలు ఉన్నాయని మరియు, ఆ రాష్ట్రంలో 84.5% అటవీ విస్తీర్ణం ఉందని, ఇది దేశంలోనే అతిపెద్ద వాటిలో ఒకటి అని గవర్నర్ అన్నారు. మిజో ప్రజలు తమ సాంప్రదాయ జానపద నృత్యం చెరా నృత్యానికి ప్రసిద్ధి చెందారని, దీనిని వెదురు నృత్యం అని కూడా పిలుస్తారని, మరియు లయ బద్ధంగా నృత్యం చేస్తారని చెప్పారు. 'ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్' కార్యక్రమం వివిధ రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆచారాల గురించి తెలుసుకోడానికి వీలు కల్పిస్తుందని, రాష్ట్రాల మధ్య మెరుగైన అవగాహన మరియు దృఢమైన బంధానికి వీలు కల్పిస్తుందని, తద్వారా భారతదేశ ఐక్యత మరియు సమగ్రతను బలోపేతం చేస్తుందని గవర్నర్ అన్నారు. మిజోరం గవర్నర్ జనరల్ (డాక్టర్) విజయ్ కుమార్ సింగ్ మరియు అరుణాచల్ ప్రదేశ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ కైవల్య త్రివిక్రమ్ పర్నాయక్ వీడియో సందేశాలతో కార్యక్రమం ప్రారంభమైంది, తరువాత ఐకాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన రెండు రాష్ట్రాల సాంప్రదాయ జానపద నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి.

గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము, జాయింట్ సెక్రటరీ పి.ఎస్.సూర్య ప్రకాష్, లోక్ భవన్ అధికారులు మరియు విజయవాడ మరియు చుట్టుపక్కల విద్యా సంస్థలలో చదువుతున్న మిజోరం మరియు అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ కీర్తి కిరీటం విశాఖపట్నం

**- శాసనసభ ప్రశ్నోత్తరాల్లో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి - విశాఖ పరిసర ప్రాంత అభివృద్ధికి రూ. 8,650 కోట్ల పెట్టుబడులతో 50 ఒప్పందాలు కుదుర్చుకున్నామని స్పష్టం - హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో అంతర్జాతీయ స్థాయిగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్న మంత్రి దుర్గేష్ - సీ-ప్లేన్, క్రూజ్ సర్క్యూట్, హెలీ టూరిజంపై ప్రత్యేక దృష్టి సారించామని వివరణ - విశాఖను అడ్వెంచర్, యాంకర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని మంత్రి దుర్గేష్ వెల్లడి - విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను మూడు పర్యాటక హబ్‌లుగా చేయాలన్నదే తమ లక్ష్యమన్న మంత్రి కందుల దుర్గేష్**



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో విశాఖపట్నం ఒక కలికుతురాయి అని, దానిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అసెంబ్లీలో స్పష్టం చేశారు. విశాఖపట్నం దక్షిణ ఎమ్మెల్యే సిహెచ్. వంశీ కృష్ణ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. నూతన పర్యాటక పాలసీ (2024-29)తో విశాఖను యాంకర్ హబ్‌గా చేస్తూ 'హబ్ అండ్ స్పోక్' మోడల్‌లో సింహాచలం, బౌద్ధ, బీచ్, ఎకో టూరిజం థీమాటిక్ సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఇటీవల జరిగిన సీఐఐ సమ్మిట్ ద్వారా రూ. 8,650 కోట్ల విలువైన 50 ఒప్పందాలు కుదిరాయని, తద్వారా ఒబెరాయ్, తాజ్, మేఫెర్, అట్మాస్ఫియర్ కోర్ వంటి ప్రముఖ హోటల్ సంస్థలు విశాఖకు వస్తున్నాయన్నారు. అదేవిధంగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డులో 16 ప్రాజెక్టులను ప్రభుత్వం ఆమోదించిందన్నారు. తద్వారా విశాఖలో 2858 రూమ్ ల ఏర్పాటుకు రూ.4098 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీమ్ కింద సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి రూ. 54.04 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 కింద బొర్రా గుహల అభివృద్ధికి రూ. 28.87 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేశామన్నారు.

# చట్ట ప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తాం : యస్.పి..అజిత వేజెండ్ల








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా పోలీసు కార్యాలయం నందు నిర్వహించిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో 123 ఫిర్యాదులు స్వీకరణ. ప్రజా ఫిర్యాదుల పట్ల అలసత్వం ఉండరాదు.. ప్రజలతో జవా బుదారీగా వ్యవహరించి పిటీషన్లను పరిష్కరించాలని ఆదేశాలు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, చట్టపరిధిలో పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా యస్.పి.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 123 ఫిర్యాదులు వచ్చాయి. 1. కనిగిరి మండల పిఎస్‌కు చెందిన మహిళ తన కుమార్తె 03.02.2026 నుంచి కనిపించడం లేదని కర్రేద్దుల. రమ్య అనే ఆమె వెంటపెట్టుకొని తీసుకేల్లినట్టు కలిగిరి పిఎస్‌లో కేసు నమోదు అయినట్లు తన కుమార్తె ఆచూకీ కనుగొని అప్పగించాలని కోరారు.

2. కోట మండల పిఎస్‌కు చెందిన మహిళని కోట టౌన్‌కు చెందిన సుధీర్ అను అతను 1,50,000/ తీసు కొని తన స్థలానికి పాస్ బుక్కులు 1బి అడంగల్ చేయిస్తానని మాయమాటలు చెప్పి చేయించలేదు డబ్బులు అడిగితే పట్టించుకోకుండా అవమానకరంగా తిట్టి బెదిరిస్తున్నాడని, విచారణ జరిపి న్యాయం చేయమని కోరారు. 3. మనుబోలు మండల పిఎస్‌కు చెందిన మహిళ అదే ప్రాంతానికి చెందిన సంతోష్ అనే అబ్బాయి ప్రేమ పేరుతో తన కుమార్తెను వేదిస్తున్నట్లు అడిగితే చంపుతానని బెదిరిస్తున్నట్లు అలాగే పిర్యాది కుటుంబ సభ్యులను కూడా బెదిరిస్తున్నట్లు, విచారించి తగిన న్యాయం చేయమని కోరారు. 4. కావలి 2 టౌన్‌కు చెందిన వృద్ధ దంపతులైన గూడూరు. వెంకట సుబ్బమ్మ మరియు ఆమె భర్తకు చెందిన స్థలాన్ని తంగిసేట్టి. వెంకటేశ్వర్లు మరికొందరు కలిసి ఆక్రమించి ప్రహరి గోడ కట్టారు వారిపై కోర్ట్ నుంచి ఇంజక్షన్ ఆర్డర్స్ ఉన్నప్పటికీ ఇబ్బందులకి గురి చేస్తున్నట్లు, విచారించి న్యాయం చేయమని కోరారు.

5. దర్గామిట్ట పిఎస్‌కు చెందిన పెద్దిరెడ్డి. ఆదినారాయణ తన ఇంటిలో 29.10.2025 న గుర్తు తెలియని వ్యక్తులు బంగారం దొంగిలించినట్టు దర్గామిట్ట పిఎస్‌లో కేసు నమోదైనట్టు, విచారణ జరిపి చోరి సొత్తు రికవరీ చేయించగలరని పిర్యాది కోరారు. 6. ఇందుకూరుపేట పిఎస్‌కు చెందిన మహిళా తన భర్త మానసికంగా, శారీరకంగా వేదిస్తున్నట్లు నన్ను పిల్లల్ని పుట్టింటికి తరిమివేశాడని, డబ్బులు తీసుకురమ్మని వేదిస్తున్నా డని, విచారించి తగిన న్యాయం చేయమని కోరారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నిం టిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సం ధర్భంగా జిల్లా యస్.పి. అజిత వేజెండ్ల, ఐపియస్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా యస్.పి., అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, ఎస్‌బి డిఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస రావు, డిసిఆర్‌బి సిఐ రామారావు, మహిళా స్టేషన్ సిఐ సుబ్బా రావు, ఎస్‌బి-1 సిఐ వెంకటేశ్వర రావు, ఎస్‌బి-2 సిఐ శ్రీనివాస రెడ్డి మరియు కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌కు ప్రాధాన్యం... అర్జీలకు వేగవంత పరిష్కారం : డక్కిలిలో తహసీల్దార్ శ్రీనివాసులు స్పష్టం

**డక్కిలి, (రాజధాని వార్తలు):** "ప్రజల సమస్యలపై కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, నిర్ణీత గడువులోనే పరిష్కారం కావాలి" అని డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినతులను స్వీకరించిన అనంతరం అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

**క్షేత్రస్థాయి పరిశీలనకు ఆదేశాలు**

పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీపై వీఆర్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, వాస్తవ పరిస్థితులను నివేదిక రూపంలో సమర్పించాలని తహసీల్దార్ ఆదేశించారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచే ధోరణి అసలు ఉండకూడదని, వెంటనే సంబంధిత శాఖలకు పంపించి చర్యలు ప్రారంభించాలని సూచించారు. "అర్జీ పరిష్కారానికి ఆలస్యం జరిగితే బాధితులకు కారణం స్పష్టంగా తెలియజేయాలి. అనిశ్చితి, నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదు" అని ఆయన హెచ్చరించారు.

**రెవిన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి**

భూమి హక్కులు, సర్వే వివాదాలు, పాసుబుక్ల జారీ వంటి రెవిన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని శ్రీనివాసులు పేర్కొన్నారు. గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటే ప్రజలు కార్యాలయాలకు తిరగాల్సిన పరిస్థితి ఉండదన్నారు.

**సమన్వయంతోనే ఫలితాలు**

పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి వివిధ శాఖల మధ్య సమన్వయం కీలకమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి విభాగం బాధ్యతాయుతంగా వ్యవహరించి, ప్రజా విజ్ఞప్తుల దినాన్ని కేవలం వినతులు స్వీకరించే కార్యక్రమంగా కాకుండా, ఫలితాల వేదికగా




మలచాలని సూచించారు.

**పెరుగుతున్న ప్రజల నమ్మకం**

ప్రజా విజ్ఞప్తుల దినం ద్వారా తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లగలమనే నమ్మకం ప్రజల్లో పెరుగుతోందని ఆయన వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. నిర్ణీత గడువుల్లో స్పందన, క్షేత్రస్థాయి పరిశీలన, పారదర్శకతతో పనిచేయాలని డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం, బాధ్యతాయుత వైఖరి ప్రధానమని పేర్కొన్నారు. డక్కిలి హైస్కూలుకు

**క్రీడా మైదానంకు స్థలం కేటాయించండి**

డక్కిలి హైస్కూలు విద్యార్థులకు క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన స్థలం ఇవ్వాలని ఎంఈవోలు జగదీష్ బాబు, వెంకటేశ్వర్లు, మండల టీడీపీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పీజేఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు. ఈ విషయంపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి స్థలం కేటాయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

## వాసుపల్లి గణేష్ కుమార్ ఇంట వివాహ మహోత్సవానికి గంట్లకు ఆహ్వానం

**- జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబుకు స్వయంగా ఆహ్వానం అందజేత**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వాసుపల్లి గణేష్ కుమార్ కుటుంబంలో జరుగుతున్న వివాహ మహోత్సవం సందర్భంగా ఆహ్వాన కార్యక్రమం ఆత్మీయతతో కొనసాగింది. ఈ శుభ వేడుకకు అతిథిగా జాతీయ జర్నలిస్టు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబుని స్వయంగా ఆహ్వానించేందుకు వాసుపల్లి ఎంతో ఆరాటపడ్డారు. మొదట ఆయనకు ఆహ్వానం అందించి నప్పుడు, "ఆహ్వానం లేకపోయినా తప్పకుండా వస్తాను" అంటూ శ్రీనుబాబు సున్నితంగా స్పందించారు. అయితే, ఆ సమాధానంతో సంతృప్తి చెందని వాసుపల్లి, స్వయంగా జీవీఎంసీ కార్యాలయానికి వెళ్లి, మర్యాదపూర్వకంగా, కానీ ఆత్మీయంగా "తప్పకుండా రావాలని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ ఆత్మీయతను ప్రతిబింబించింది. వాసుపల్లి మనస్ఫూర్తి ఆహ్వానాన్ని గౌరవిస్తూ, గంట్ల శ్రీనుబాబు వివాహ మహోత్సవానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. ఈ ఆహ్వాన కార్యక్రమం పరస్పర గౌరవానికి, స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచింది. కుటుంబ వేడుకలను సైతం ఆత్మీయంగా



పంచుకునే సంస్కారం సమాజంలో సుస్థిర సంబంధాలను బలోపేతం చేస్తుందని ఈ సందర్భంగా మరోసారి గంట్ల శ్రీనుబాబు స్పష్టం చేశారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కించే వరకు పోరాటం కొనసాగుతుంది

**- ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ**




**తిరుపతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో అంగన్వాడీల సమ స్యలను తాము అధికారులకు వచ్చిన మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు పట్టించుకున్న పాపాన పోలేదని ఈ నేపథ్యంలో వారి సమస్యలు అన్ని పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ స్పష్టం చేశారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలనీ, గ్రాట్యుటీ, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఐఎఫ్టియు, సిఐటియు, ఏఐటియుసి యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తిరుపతిలో ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్టీయు) ఆధ్వర్యంలో రాస్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న అంగన్వాడి కార్యకర్తలను ఉద్దేశించి రాయపనేని హరికృష్ణ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, శిశువులు, పిల్లల ఆరోగ్యాలను కాపాడటంలో ఐసిడిఎస్ లక్ష్యాలను అంగన్వాడీలు ముందుకు తీసుకు వెళుతున్నారని వివరించారు. పాలకులు మాత్రం అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ఏమాత్రం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. అతి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాని వారిని కనీసం కార్మికులుగా కూడా చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని భారం పెంచి కనీస వేతనాలు మాత్రం అమలు చేయడం లేదని అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ప్రకారం గ్రాట్యుటి, పిఎఫ్, ఈఎస్ఐలు అమలు చేయాల్సి ఉందని చెప్పారు. అంగన్వాడీలకు కనీస వేతనం 26000, వర్కర్లకు 20,000 ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టం ప్రకారం అమలు చేయాలని పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ తరహాలోనే వ్యవహరిస్తోందని ఇది సరికాదన్నారు. అంగన్వాడీలు తలుచుకుంటే ప్రభుత్వాలు తలకిందులు అవుతాయని గుర్తించుకోవాలన్నారు. ఏపీ ప్రగతిశీల అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐఎఫ్టీయు తిరుపతి నగర అధ్యక్షురాలు సుజాత కార్యదర్శి నాగరత్న, నాయకురాలు గంగాదేవి మాట్లాడుతూ పోరాటంలో భాగంగా ఈనెల 23 నుండి 27 వరకు రేలే నిరాహార దీక్షలు చేపడతామని ప్రభుత్వం స్పందించకుంటే మార్చి 2న విజయవాడలో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు ఐఎఫ్టియు సీనియర్ నాయకులు వెంకటరత్నం మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ముందు హామీలు ఇవ్వడం ఆ తరువాత నిర్లక్ష్యం చేయడం పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని పాలకులను నిలదీయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ప్రగతిశీల అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐఎఫ్టీయు తిరుపతి నగర అధ్యక్షురాలు సుజాత, కార్యదర్శి నాగరత్న, నాయకురాళ్లు అరుణ, గంగాదేవి, శశికళ, విమల, అరుణ, ఐఎఫ్టీయు నాయకులు రమేష్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి రాణి, ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కుడుం విజయ్ కుమార్, నాయకుడు ముని కుమార్ పిడిఎస్‌యు నాయకుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ఆపరేషన్స్ లంగ్స్ 3.0 ప్రారంభం

**- సెల్లార్‌లలో ఆక్రమణల తొలగింపు - జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో పలు జోన్ల పరిధిలో ఆపరేషన్ లంగ్స్ 3.0లో భాగంగా సెల్లార్ / స్టిల్ట్ ఫ్లోర్‌లలో ఆక్రమించిన 7 ఆక్రమ ణలను సోమవారం తొలగించడం జరిగిందని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. మహా విశాఖ నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు నగర పరిధిలో ప్రజలు, వాహనదా రులు రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై, బహిరంగ ప్రదేశాలలో వారి వారి వాహనాలను పార్కింగ్ చేస్తున్నందు వలన రోడ్లు ఇరుకునకు గురై ట్రాఫిక్‌నకు అంతరాయం కలుగుతున్నందున ప్రజలు, వాహనదారుల ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సౌకర్యార్థం వాణిజ్య సముదాయాలు, పలు అపార్ట్మెంట్‌లలో సెల్లార్ / స్టిల్ట్ ఫ్లోర్‌లను పూర్తిగా కేవలం వాహనాలు నిలుపుకొనే సౌకర్యార్థం ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పంతో ఆపరేషన్ లంగ్స్ 3.0 నేడు ప్రారంభించి నాలుగు జోనులలో 7 సెల్లార్ / స్టిల్ట్ ఫ్లోర్‌ల ఆక్రమణలను జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీస్ వారి సహకారంతో తొలగించడం జరిగిందని ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి తెలిపారు. ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా సౌత్ జోనులో 31వ వార్డు డాబాగార్డెన్స్‌లో ఒక కమర్షియల్ షాప్, ఈస్ట్ జోనులో 17వ వార్డు యం.వి.పి.కాలనీ, సెక్టార్-1లో ఒక కమర్షియల్ షాప్, వెస్ట్ జోనులో 90వ వార్డు



గవరవీధిలో రెండు విజిటబుల్ షాప్, 91వ వార్డులో బుచ్చిరాజు పాలెం మెయిన్ రోడ్ వద్ద క్లోజేడ్ గ్రిల్స్‌ను, 66వ వార్డు గాజువాక మెయిన్ రోడ్డునందు రెండు ఆక్రమణలు లక్కీ షాపింగ్ మాల్ వద్ద తాత్కాలిక టైలరింగ్ షాప్, జిబిఆర్ షాపింగ్ మాల్ వద్ద షట్టర్ మరియు గోడలను తొలగించడం జరుగిందని చీఫ్ సిటీ ప్లానర్ తెలిపారు. నగరంలో ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా సెల్లార్ / స్టిల్ట్ ఫ్లోర్‌ల ఆక్రమణలను తొలగించడం జరుగుచున్నందున, ఇప్పటికే పలు సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లలో పార్కింగ్ కోసం కాకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను వెంటనే స్వచ్ఛందంగా ఆక్రమణదారులు తొలగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా జోనుల సహాయక ప్రణాళిక అధికారులు, ప్రణాళిక విభాగం సిబ్బంది, సచివాలయం సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రాహుల్‌కు ఎందుకీ కంటగింపు?

సమర్థ నాయకత్వం, సరైన మార్గదర్శనంతో భారత్ గత పన్నెండేళ్లుగా.. వికసిత భారతదేశ నిర్మాణం కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుంది. ప్రజల భాగస్వామ్యంతో వాటిని సాధించే దిశగా అడుగులేస్తోంది. 'ఆత్మనిర్భర' నినాదంతో దేశీయంగా మన కాళ్లమీద మనం నిలబడే విధంగా చర్యలు తీసుకుంటూ.. విదేశాలతో బలమైన సంబంధాలను ఏర్పర్చుకుంటూ.. దేశ 'బంగారు భవిష్యత్తుకు భరోసా'ను సుస్థిరం చేసుకుంటోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో.. పుష్కరకాలంగా ప్రపంచంలోని ముఖ్య దేశాలు, కీలక కూటములతో భారతదేశం వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకుంటోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, 27 దేశాల సమాహారమైన యూరోపియన్ యూనియన్, బ్రిటన్, ఒమన్, మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాలతో కుదుర్చుకున్న మొత్తం 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో (ఫ్టీఏ) భారత్.. ఉత్పత్తి, సేవల, వ్యవసాయ రంగాలకు మన దేశంలో పెద్దఎత్తున కొత్త మార్కెట్లకు ద్వారాలు తెరుచుకున్నాయి. గ్లోబల్ సప్లయ్ చైన్స్ పునర్వ్యవస్థీకృతమవుతున్న ఈ సమయంలో ఫ్టీఏల ద్వారా భారత్.. అంతర్జాతీయంగా అనేక దేశాలకు అత్యంత విశ్వసనీయమైన భాగస్వామిగా నిలుస్తోంది. ఇలాంటి వ్యూహాత్మకమైన సమయంలో.. ప్రధాని మోదీ నాయకత్వంలో కుదిరిన భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం ఒక వాణిజ్య ఒప్పందంగా మాత్రమే కాకుండా.. 21వ శతాబ్దపు భారత్ అభివృద్ధి ప్రయాణంలో ఓ కీలక మైలురాయిగా నిలిచిపోనుంది. భారత్, అమెరికా ఒప్పందంపై సరైన అవగాహన లేకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పిస్తున్నారు. కానీ, దేశ ప్రయోజనాలను కాపాడే విషయంలో రాజీ పడకుండా.. 140 కోట్ల భారతీయుల విశ్వాసాన్ని సంపాదించుకున్న ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను సహించలేక, చేస్తోన్న మంచి పనులను.. అబద్ధాలతో, అసందర్భంగా కాంగ్రెస్ పార్టీ గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని మూడు ప్రధాన కోణాల్లో అర్థం చేసుకోవాలి. మొదటిది.. సాంకేతికతను ఇచ్చిపుచ్చుకోవడం, రెండోది.. పెట్టుబడుల విస్తరణ, మూడోది.. గ్లోబల్ వ్యాల్యూ చెయిన్‌లో భారతదేశ స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం, ఇవి ప్రధాన లక్ష్యాలుగా కార్యాచరణ ఏర్పాటు చేసుకున్నాం. ప్రపంచంలో అతిపెద్ద మార్కెట్‌గా, సేవల కేంద్రంగా భారత్ ఎదిగింది. ఇప్పుడు.. ఉత్తమ సాంకేతికత తయారీ, డిజైన్‌లకు కేంద్రంగా మారేందుకు ఈ ఒప్పందం కీలకంగా మారనుంది. సెమీకండక్టర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ, డిఫెన్స్, స్పేస్, సైబర్ సెక్యూరిటీ లాంటి అనేక రంగాల్లో మనం మరింత పురోగతి సాధించేందుకు వీలుపడనుంది. ఈ సాంకేతికత ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా.. అత్యాధునిక పరిజ్ఞానం భారత దేశానికి అందుబాటులోకి వస్తుంది. మన ఇంజనీర్లు, మన స్టార్టప్‌లకు ప్రపంచస్థాయి ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం లభిస్తుంది. దీని కారణంగా.. టెక్నాలజీ దిగుమతిదారుగా ఉన్న భారతదేశం.. ఇకపై గ్లోబల్ స్టాండర్డ్ టెక్నాలజీని ఎగుమతి చేయనుంది. దేశ రాజధాని నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ఓ స్పష్టమైన, సానుకూలమైన ప్రభావాన్ని చూపించే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై విపక్షనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు.. రైతులు, ఎగుమతిదారుల్లో అనవసర అనుమానాలను కలిగించేందుకు చేసిన కుటిల ప్రయత్నమే. రోజురోజుకూ దేశ రాజకీయాల్లో అస్తిత్వాన్ని కోల్పోతున్న రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ.. నెగటివ్ రాజకీయాల ద్వారా ప్రజల్లో అశాంతిని, రేకెత్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పదేళ్ల యూపీఏ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజలు ఆగ్రహించి ఆ ప్రభుత్వాన్ని గద్దెదించితే.. ఈ పన్నెండేళ్లలో తమ కళ్లముందు జరుగుతున్న పురోగతికి అదే ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తుండటంతో రాహుల్ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే.. అవకాశం చిక్కినపుడల్లా అబద్ధాలతో ప్రజలను ప్రభుత్వంపై రెచ్చగొట్టేలా దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం భారత్ రూ.4 లక్షల కోట్ల విలువైన వస్త్రాలను వివిధ దేశాలకు ఎగుమతి చేస్తోంది. 38 అభివృద్ధి చెందిన దేశాల పరిధిలోని 9 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా.. ఈ ఎగుమతులు మరో పదిరెట్లకు పైగా పెరిగి.. రూ.45 లక్షల కోట్ల విలువైన టెక్స్‌టైల్ మార్కెట్‌కు అవకాశాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అమెరికా దాదాపు రూ.10 లక్షలకోట్ల వస్త్రాలను దిగుమతి చేసుకుంటోంది. ఇందులో భారతదేశం నుంచే దాదాపు 10 శాతం వస్త్రాలు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. ఈ కొత్త ఫ్టీఏ తర్వాత మన ఎగుమతులు మరింత పెరగనున్నాయి. ఈ పరిస్థితులకు తగ్గట్లుగా.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 7 మెగా టెక్స్‌టైల్ పార్కులను అభివృద్ధి చేస్తోంది. ఇందులో ఒకటి తెలంగాణలోని వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పేరుతో డెవలప్ అవుతోంది. ఇలాంటి ప్రాజెక్టులు అమెరికా మార్కెట్‌తో అనుసంధానమైతే వేలాది యువతకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. దీనివల్ల తెలంగాణలోని చేనేత కార్మికులకు కూడా పెద్దమొత్తంలో లబ్ధి చేకూరనుంది. ఇది ఒక్క వస్త్ర పరిశ్రమ గురించిన ప్రస్తావన మాత్రమే. వివిధ పరిశ్రమలతో తెలంగాణకు మరింత ప్రయోజనం చేకూరడం ఖాయం. వస్త్ర పరిశ్రమ పెరిగితే.. పత్తి ఉత్పత్తికి కూడా డిమాండ్ పెరుగుతుంది. దీని ద్వారా రైతుల ఆదాయం కూడా పెరుగుతుంది. ఇది ఒక చైన్ ప్రాసెస్. కానీ, రాహుల్‌గాంధీ మాత్రం దీనికి భిన్నమైన, అర్థంలేని వాదనతో దేశ వస్త్ర పరిశ్రమ ఎగుమతిదారులను, పత్తి డిమాండ్ తగ్గుతుందని రైతులను భయపెట్టేందుకు కుట్రలు పన్నుతున్నారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా అనేక అంశాల్లో రాజీ పడిన సంగతి మనందరికీ తెలుసు.

## చెత్త రహిత పాలనకు ప్రజలు అందరూ సహకారం అందించాలి

### - మన విశాఖను మనమే దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి
### - విద్యార్థులు అందరూ పర్యావరణ హితంగా జీవించాలి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శృతి శ్రీ, విశాఖ జిల్లా ఐఇసి కోఆర్డినేటర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చెత్త రహిత పాలనకు ప్రజలు అందరూ సహకారం అందించాలి అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ విశాఖపట్నం జిల్లా ఐఇసి కోఆర్డినేటర్ శృతి శ్రీ పిలుపునిచ్చారు. ఎంవిపి కాలనీలో సెవెంత్ డె అడ్వెం టిస్ట్ విద్యా సంస్థలో సోమవారం ఉదయం ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ అధ్యక్షతన గ్రీన్ క్లైమేట్ టీం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ల నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో భాగంగా "చెత్త రహిత పరిపాలన" (జీరో వేస్ట్ లిట్టర్ గవర్నెన్స్) కార్యక్రమం నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మన దేశానికి ఆదర్శంగా విశాఖను తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థులు అందరూ పర్యావరణ హితంగా జీవించాలని కోరుతూ అవగాహన కల్పించారు. మేధావులు సహకారం అందించాలన్నారు. విద్యార్థులు, మహిళలు, నగరవాసులు అందరూ చెత్త రహిత నగరంగా విశాఖ మహానగరాన్ని తీర్చి దిద్దడానికి కంకణబద్ధులై జీవించాలని కోరారు. మన అందమైన నగరాన్ని ఒక సుందరమైన విధంగా తీర్చిదిద్దాలని కోరారు. వంటింటి వ్యర్థాలతో ఎరువు తయారు చేసి ఎవరి ఇంటి వద్ద వారె కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించడం అవసరం అని వివరించారు. సమస్త జీవరాశి నీ కాపాడుకోవాలి అని వివరించారు. ప్రతి విద్యార్థి ఒక హరిత సైనికులుగా మారాలి అని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో కన్వీనర్ విశాలాక్షి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, గ్రీన్ వాలంటీర్ జె రాజేశ్వరి, హెడ్ మాస్టర్ జాస్లిన్ నవీన్ విప్పర్తి తదితరులు పాల్గొని మాట్లాడారు.

## స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం : డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర విజయవంతంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలక మని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు తెలిపారు. 32వ వార్డు అల్లిపురం మార్కెట్ ప్రాంతంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఉద్యోగులు, స్థానికులతో ఆయన స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. పర్యటించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా చేపట్టిన కార్యక్రమాలపై ప్రజలను చైతన్యవంతులను చేసి వాటిని విజయవంతం చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే మార్పులను అధిగమించేందుకు ప్రతీ పౌరుడు సామాజిక బాధ్యతగా మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మానవాళి మనుగడ పచ్చదనం పరిఢవిల్లితేనే సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలన్నారు. అలాగే ప్లాస్టిక్ వాడకం పెనుభూతంలాంటిదని, పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని గట్టిగా అమలు చేయకుంటే మన భావితరాలకు పెనుముప్పు తప్పదని హెచ్చరించారు. సుసంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర 2047 దార్శనిక పత్రంలోని 10 సూత్రాల్లో



సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర అనేది ఒక సూత్రంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్తో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాలి కాలుష్యం వల్ల ఎదురయ్యే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజా రవాణా వ్యవస్థ, సౌర విద్యుత్ వినియోగం వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. నిత్య జీవిత ప్రయాణాన్ని పర్యావరణహిత మార్గంలో సాగించేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ఎస్ఐ కీర్తి, సెక్రటరీలు శశిబాల, పవన్, ప్రసాద్, దివ్యశ్రీ, వార్డు మేస్త్రి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## చీకటి రహిత వార్డుగా 48వ వార్డుని నెలకొల్పడమే గుడ్ మార్నింగ్ గంకల లక్ష్యం

### - 48వ వార్డు బాపూజీ నగర్‌లో నూతన ఎలక్ట్రికల్ పోల్స్‌ను ఏర్పాటు చేయించిన గంకల



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతంలో ఎలక్ట్రికల్ పోల్స్, నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయా లని 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ బిజెపి ఫ్లోర్ లీడర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ గంకల కవిత అప్పారావు యాదవ్ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమీష నర్, జీవీఎంసీ మేయర్, ఏపీఈపీడీ సీఎల్ సీఎండిలకు పలుమార్లు వినతు లు చేశారు. గంకల కవిత అప్పారావు యాదవ్ పిర్యాదుపై అధికారులు స్పందించి సోమవారం వార్డులో పర్యటిం చారు. ఈ సందర్భంగా 48వ వార్డునకు రూ.16.5 లక్షలతో నూతన రింగ్ పోల్స్, 6 మీటర్ల పోల్స్ 35,45 వీధి దీపాలు కేటా యించినట్లు గంకల కవిత అప్పారావు యాదవ్ తెలిపారు. ఇందులో భాగంగా వార్డులో గల బాపూజీ నగర్, రామకృష్ణ నగర్, నీలకంఠ నగర్‌లో ఏ ప్రాంతంలో ఎలక్ట్రికల్ పోల్స్ అవసరం ఉన్నది అనేది అధికారులతో కలిసి గంకల కవిత అప్పారావు యాదవ్ పర్యటించి పలుచోట్ల పోల్స్ ఏర్పాటు చేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా ఉదయం నుంచి కార్మికులతో కలిసి మధ్యాహ్నం భోజనం విరామం లేకుండా కార్మికులతో రాత్రి వరకు ఉండి వార్డులో నూతన పోల్స్, లైట్స్ ఏర్పాటుకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48 వ వార్డు అంతా కొండ ప్రాంతం కావడంతో చీకటి ప్రదేశం నెలకొంటుందని, ఈ చీకటి ప్రదేశంలో ఆకతాయిల ఆగడాలు పెరుగుతున్నాయని, నిత్యం దొంగతనాలు జరుగుతున్నాయని పలుమార్లు కలెక్టర్, జీవీఎంసీ కమీషనర్, జీవీఎంసీ మేయర్, ఏపీఈపీడీసీఎల్ సీఎండిలకు వార్డులో నూతన రింగ్ పోల్స్ ఏర్పాటు చేయాలని వినతి అందజేయడం జరిగిందని, ఇదే విషయంపై జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించడం జరిగిందన్నారు. గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వార్డు ప్రజల సమస్యలు తెలుసుకుని వార్డులో రింగ్ పోల్స్ అవశ్యకత ఉందని ప్రజల ద్వారా తెలుసుకొని గత నాలుగు ఏళ్లగా పోరాటం చేశామని ఈ పోరాటానికి ఫలితం దక్కింద న్నారు. పలుమార్లు అందించిన వినతులపై జీవీఎంసీ కమిషనర్, మేయర్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ అధికారులు స్పందించి వార్డులో ఎలక్ట్రికల్ పోల్స్ కేటాయించడం జరిగిందని, వాటిని బాపూజీ నగర్, రామకృష్ణ నగర్, నీలకంఠ నగర్‌లో పలు చోట్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలో మరి కొన్నిచోట్ల హైమాస్ట్ వీధి దీపాలను ఏర్పాటు చేసి వార్డు అంతట విద్యుత్ దీపాల వెలుగులను కురిపిస్తామన్నారు. వార్డులో అధికారులతో కలిసి పర్యటించి పలు సూచనలు ఇచ్చినట్లు గంకల పేర్కొన్నారు. అతి త్వరలో వార్డులో మరిన్ని వీధి దీపాలు, సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామని గంకల హామీ ఇచ్చారు. ప్రతి క్షణం వార్డు అభివృద్ధి కోసమే కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. 48వ వార్డులో ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు పట్ల గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి ఫలించిందని, వార్డులో గంకల కవిత అప్పారావు యాదవ్ కృషితో నూతన వెలుగులు వెలగడం పట్ల పలువురు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వార్డు ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని గంకల కవిత అప్పారావు యాదవ్ సూచించారు.

## దొంగతనాల పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ తోట సునీత



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలంలో ఇటీవల చోటు చేసుకుంటున్న దొంగతనాల ఘటనల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పోలీస్ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు కరప సబ్ ఇన్స్పెక్టర్ తోట సునీత, ఏఎస్ఐ వాడపల్లి సూరిబాబు ఆటో మొదలగు వాహనాల ద్వారా మండల పరిధిలో 23 గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. రాత్రి సమయంలో గాలి కోసం ఇంటి తలుపులు తెరిచి ఉంచరాదని, ఇంటి ఆవరణలో నిద్రపోయినా తప్పనిసరిగా ఇంటికి తాళాలు వేయాలని సూచించారు. బయటకు వెళ్తున్నప్పుడు తలుపులకు తాళాలు వేసినట్లు బయట వారికి స్పష్టంగా కనిపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇరుగుపొరుగు వారిని ఇంటిని గమనించమని కోరాలని తెలిపారు. దూర ప్రాంతాలకు ఎక్కువ రోజుల పాటు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్ సదుపాయం కల్పించేందుకు ముందుగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మండలంలో దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో బంగారం, వెండి వంటి విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని పేర్కొన్నారు. రాత్రివేళ గ్రామాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే కరప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర సేవల నంబర్ 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు. బంగారు ఆభరణాలు ధరించి బయటకు వెళ్లేటప్పుడు చైన్ స్నాచింగ్ ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మోటార్ సైకిల్‌పై వెళ్తూ కింద పడిపోయినట్లు నటించి సహాయం కోరుతూ సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయని, అలాంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ప్రజల రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూడా మొబైల్ ఫోన్ దొంగతనాలు జరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఇంటి ముందు మోటార్ సైకిళ్లు పార్క్ చేసేవారు డబుల్ లాక్స్ ఉపయోగించాలని, ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టగలమని, అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ తోట సునీత విజ్ఞప్తి చేశారు.

## లయన్స్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు లయన్స్ క్లబ్ నందు లయన్స్ క్లబ్ సభ్యులు సహ కారంతో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్య శిభిరంలో సుమారు 173 మంది పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. గత 15 సంవత్సరాల విశేష అనుభవం కలిగిన పెద్దాపురం భార్గవ్ హాస్పిటల్ వైద్యులు ఈ వైద్య శిబిరంలో సేవలనందించారు. ఈ శిబిరంలో 15 మందికి రూ. 3500 విలువ గల ఎండోస్కోపీ పరీక్షలు, రూ. 2500 విలువ గల వెరికోస్ వెయిన్స్ టెస్ట్‌కి 8 మందిని, పైల్స్ టెస్ట్‌కి 5 గురికి, ఎకో 4 మంది, ట్యూమర్ ఆపరేషన్‌కు ఇద్దరకు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంకి ముఖ్య అతిధి లయన్ లింగమల్లు కృష్ణమూర్తి హాజరై శిభిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ అమలకంటి శ్రీనివాసరావు, ప్రోగ్రాం చైర్మన్ బుర్రే కృష్ణమోహన్, సెక్రటరీ బడుగు సీతారామ రాజు, ట్రజరర్ యేలేటి రమేష్, లయన్స్ పాస్ట్ గవర్నర్ ఈదల ఈశ్వర్ కుమార్, లయన్స్ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ చిత్తూలూరి వీర్రాజు, నాయకులు కర్రి ఆదినారాయణ రెడ్డి, మేకా శ్రీనివాసరావు, గుండు శంకరావు, క్లబ్ నాయకులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొని సేవలనందించారు.

## ఆర్టోస్ కంపెనీలో విద్యార్థులకు విద్యా పర్యటన

**కరప, (రాజధాని వార్తలు):** భారత ప్రభుత్వ సంస్థ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులకు విద్యా పర్యటన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ చంద్రపురం సమీపంలోని వెంటూరులో ఆర్టోస్ కంపెనీని విద్యార్థులు సందర్శించారు. కంపెనీ ప్రతి నిధులు విద్యార్థులకు డ్రింక్‌ల తయారీ ప్రక్రియను ప్రదర్శించారు. ముడి పదార్థాల ఎంపిక నుంచి తుది ఉత్పత్తి వరకు అనుసరించే బిఐఎస్ ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ విధానాలపై వివరించారు. ప్రయోగాత్మకంగా తయారీ విధానాన్ని గమనించిన విద్యార్థులు పరిశ్రమల్లో అమలయ్యే ప్రమాణాలపై అవగాహన పొందారు. నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత, ప్యాకేజింగ్ విధానాల గురించి ప్రత్యక్షంగా తెలుసుకోవడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ పర్యటన విద్యార్థుల్లో పరిశ్రమల పట్ల ఆసక్తిని పెంచుతూ భవిష్యత్తులో శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేస్తుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మెంటార్ షైక్ మహబూబాబాద్ అలీ, ప్రధానోపాధ్యాయురాలు ఎన్.రాజ రాజేశ్వరి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విష్ణు విన్యాసంపై అంచనాల్ని పెంచుతున్న కన్ఫ్యూజన్ సాంగ్




ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలతో ఆడియన్స్‌ను అలరిస్తూ వరుస సక్సెస్‌లు అందుకుంటున్న హీరో శ్రీ విష్ణు మరోసారి పూర్తి స్థాయి వినోదంతో రాబోతున్నారు. ఆయన తాజా సినిమా విష్ణు విన్యాసం ఇప్పటికే మంచి అంచనాలను సొంతం చేసుకుంది. ఆల్రెడీ రిలీజైన రెండు సాంగ్స్, టీజర్ ఆడియన్స్‌లో సినిమాపై ఉన్న ఆసక్తిని పెంచేయగా, తాజాగా రిలీజైన కన్ఫ్యూజన్ సాంగ్ సినిమాపై హైప్‌ను మరింత పెంచింది. ఈ సాంగ్‌ను చిత్ర యూనిట్ బ్రేకప్ సాంగ్ ఆఫ్ ది ఇయర్‌గా ప్రమోట్ చేస్తోంది. ఈ సాంగ్‌ను మ్యూజిక్ డైరెక్టర్ రాధన్ తనదైన శైలిలో ఎనర్జిటిక్ బీట్స్‌తో కంపోజ్ చేయగా, సాంగ్ వినగానే యూత్‌కు వెంటనే కనెక్ట్ అయ్యేలా రూపొందింది. శరత్ సంతోష్ ఈ సాంగ్ ను తన గొంతుతో మరింత స్పెషల్‌గా మార్చగా, బ్రేకప్ వల్లే కలిగే బాధ, ప్రేమలో తలెత్తే గందరగోళం, ఊహించని విధంగా ప్రవర్తించే ప్రేయసి వల్ల కలిగే కన్ఫ్యూజన్‌ను సరదాగా తెలియపరిచేలా రామజోగయ్య శాస్త్రి సాహిత్యాన్నిఅందించారు. పాటలో ఆయన రాసిన పదాలు యూత్‌కు బాగా రిలేట్ అయ్యేలా ఉండటం సాంగ్‌కు ప్రధాన బలంగా నిలిచింది. ఇక సాంగ్‌లో శ్రీ విష్ణు ఎక్స్‌ప్రెషన్స్, అతని డాన్సుల్లో ఈజ్, అలాగే అతని నేచురల్ యాక్టింగ్ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాయి. బ్రేకప్ బాధను కూడా సరదాగా చూపించిన విధానం ఆడియన్స్‌ను ఎంతగానో ఆకట్టుకుంటుండగా, సోషల్ మీడియాలో ఈ సాంగ్‌పై రీల్స్ భారీగా వస్తాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ కన్ఫ్యూజన్ సాంగ్ కథలోని ప్రేమ, సంబంధాల నేపథ్యంపై ఆసక్తిని మరింత పెంచేలా ఉందని చెప్పవచ్చు. ఇక సినిమా విషయానికొస్తే యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఫుల్ లెంగ్త్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కింది. విష్ణు విన్యాసంలో రొమాన్స్, కామెడీ, ఎమోషన్స్ అన్నీ సమపాళ్లలో ఉంటాయని మేకర్స్ చెప్తున్నారు. నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సత్య, వెన్నెల కిషోర్ ముఖ్య పాత్రల్లో కనిపించనుండగా, సుమంత్ నాయుడు.జి ఈ సినిమాను బడ్జెట్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ అవకుండా నిర్మించారు. ఫిబ్రవరి 27న విష్ణు విన్యాసం ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది. మొత్తానికి కన్ఫ్యూజన్ సాంగ్ అనే బ్రేకప్ సాంగ్‌తో ఈ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. చూస్తుంటే, వరుస హిట్లతో కెరీర్లో దూసుకెళ్తున్న శ్రీ విష్ణు, ఈ సినిమాతో మరో సక్సెస్‌ను ఖాతాలో వేసుకోవడం ఖాయంలానే అనిపిస్తోంది.

# పార్టీలో 'మాల'తో చరణ్.. క్లారిటీ ఇచ్చిన అల్లు శిరీష్




మెగా, అల్లు కుటుంబాల్లో ఏ చిన్న వేడుక జరిగినా అది సోషల్ మీడియాలో ఒక రేంజ్‌లో వైరల్ అవుతుంటుంది. ప్రస్తుతం అల్లు వారి ఇంట్లో పెళ్లి బాజాలు మోగుతుండటంతో అటు ఫ్యాన్స్, ఇటు సినీ సెలబ్రిటీల సందడి మామూలుగా లేదు. మార్చి 6న జరగబోయే ఈ వేడుకకు సంబంధించి ఇప్పటికే నెట్టింట రకరకాల చర్చలు నడుస్తున్నాయి. పెళ్లికి ముందు అల్లు అర్జున్ తన తమ్ముడి కోసం ఇచ్చిన గ్రాండ్ పార్టీలోని కొన్ని మూమెంట్స్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. సాధారణంగా ఇలాంటి సెలబ్రిటీ పార్టీలు అంటే గ్లామర్, సందడి మాత్రమే కాకుండా కొన్ని వివాదాలు కూడా తోడవుతుంటాయి. ఈ పార్టీలో తీసుకున్న ఒక గ్రూప్ ఫోటో బయటకు వచ్చినప్పటి నుండి సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. అల్లు శిరీష్ నయనిక జంటతో పాటు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, అల్లు అర్జున్ తమ భార్యలతో కలిసి ఈ ఫోటోలో కనిపించారు. అయితే ఈ ఫోటోలో ఒక సున్నితమైన అంశంపై నెటిజన్లు రకరకాలుగా స్పందించడంతో అల్లు శిరీష్ స్వయంగా స్పందించాల్సి వచ్చింది. అసలు విషయం ఏంటంటే, ఈ పార్టీకి రామ్ చరణ్ అయ్యప్ప మాలలో దర్శనమిచ్చారు. అయ్యప్ప స్వామి మాలలో ఉండి ఇలాంటి పార్టీలకు హాజరు కావడం ఏంటని, అక్కడ ఆల్కహాల్ వంటివి ఉంటే మాల నియమాలకు భంగం కలుగుతుంది కదా అని కొందరు నెటిజన్లు కామెంట్స్ చేయడం మొదలుపెట్టారు. చరణ్ మాల దీక్షలో ఉండి ఇలాంటి వేడుకలకు వెళ్లడంపై సోషల్ మీడియాలో రకరకాల చర్చలు మొదలయ్యాయి. ఈ ట్రోల్స్‌కు అల్లు శిరీష్ తన ఇన్స్టాగ్రామ్ కామెంట్స్ ద్వారా గట్టి క్లారిటీ ఇచ్చారు. "స్వామి (రామ్ చరణ్) ఎవరూ ఆల్కహాల్ ముట్టుకోకముందే మా పార్టీకి వచ్చారు. మమ్మల్ని విష్ చేసి వెంటనే అక్కడి నుండి వెళ్ళిపోయారు. లార్డ్ అయ్యప్ప పట్ల చరణ్ కు ఉన్న డెడికేషన్ నాకు చాలా ఇష్టం" అంటూ శిరీష్ ఆ కామెంట్‌కు రిప్లై ఇచ్చారు. ఈ వివరణతో చరణ్ పై వస్తున్న విమర్శలకు ఒకరకంగా చెక్ పడినట్లయింది. అల్లు శిరీష్ తన లాంగ్ టైమ్ లవర్ నయనిక రెడ్డిని మార్చి 6న వివాహం చేసుకోబోతున్నారు. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీతో పాటు చిత్ర పరిశ్రమకు చెందిన దిగ్గజాలు రాబోతున్నారు.

ఇప్పటికే శిరీష్ తన తల్లిదండ్రులతో కలిసి కుటుంబ సభ్యులను పెళ్లికి ఆహ్వానిస్తున్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. తన కజిన్‌పై వస్తున్న నెగిటివిటీని శిరీష్ ఇంత త్వరగా క్లియర్ చేయడం మెగా అల్లు అభిమానులను ఆకట్టుకుంది. ప్రస్తుతం రామ్‌చరణ్ తన తదుపరి చిత్రం 'పెద్ది'తో బిజీగా ఉన్నా, మాల నియమాలను పాటిస్తూనే కుటుంబ వేడుకలకు హాజరవుతున్నారు. శిరీష్ ఇచ్చిన ఈ క్లారిటీ ఇప్పుడు ఇంటర్నెట్‌లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. ఇక బుచ్చిబాబు దర్శకత్వంలో చేస్తున్న పెద్ది సినిమాను ఏప్రిల్ 30న విడుదల కానుంది. ఇక ఆ తరువాత సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమాను స్టార్ట్ చేయనున్నారు.

# 'వేదం' పూజ ఇప్పుడు యుకె కంపెనీ డైరెక్టర్..!



అల్లు అర్జున్, క్రిష్ కాంబోలో వచ్చిన 'వేదం' సినిమాతో నటిగా తెలుగు ప్రేక్షకులకు దీక్షా సేథ్ పరిచయం అయిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గా దీక్షాకి టాలీవుడ్‌లో మంచి లైఫ్ ఉంటుందని అంతా అనుకున్నారు. వేదం సినిమాలో పూజ పాత్రలో కనిపించిన దీక్షా సేథ్ మొదటి సినిమాతోనే ఆకట్టుకుంది. పైగా వేదం సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో చాలా తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమా ఆఫర్లు వచ్చాయి. 2010లో 'వేదం' సినిమాతో వచ్చిన దీక్షా సేత్ 2011లో మిరపకాయ్, వాంటెడ్ సినిమాలతో వచ్చింది. అదే ఏడాది ఒక తమిళ సినిమాలోనూ విక్రమ్‌కి జోడీగా నటించే అవకాశం దక్కించుకుంది. ఆ సమయంలో ఆమె జోరు చూస్తే దీక్షా టాలీవుడ్ టాప్ స్టార్ హీరోయిన్‌గా మారడం ఖాయం అనుకున్నారు. కానీ ఆమెకి లక్ కలిసి రాలేదు. చేసిన సినిమాల్లో ఎక్కువ శాతం బాక్సాఫీస్ వద్ద నిరాశను మిగిల్చాయి. తెలుగులో దీక్షా సేథ్ నటించిన సినిమాల్లో వేదం, మిరపకాయ్ సినిమాలు మినహా మరే సినిమాలు హిట్ కాలేదు. పైగా ఇతర భాషల్లో నటించిన సినిమాలు కూడా ఈమెకి బ్రేక్ తెచ్చి పెట్టలేదు. అందంతో పాటు కొంత అదృష్టం కూడా ఉండాలని ఈ అమ్మడి విషయంలో చాలా మంది ఒప్పుకుంటారు. నటనతో మెప్పించలేకపోయిన అందంతో ఆకట్టుకున్న హీరోయిన్స్ ఇండస్ట్రీలో చాలా మంది ఉన్నారు. కానీ దీక్షా సేత్ అందం ఉన్నా అదృష్టం కలిసి రాకపోవడంతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన కొన్నాళ్లకే దూరం కావాల్సి వచ్చింది. తెలుగులో ఈమె చివరిగా ప్రభాస్ రెబల్ సినిమాలో కనిపించింది. ఆ సినిమా అట్టర్ ఫ్లాప్ కావడంతో మరో తెలుగు సినిమా ఆఫర్ ఈమె తలుపు తట్టలేదు. ఒకటి రెండు చిన్నా చితక సినిమా ఆఫర్లు వచ్చినా దీక్షా సేథ్ వాటిని సున్నితంగా తిరస్కరించిందని, పెద్ద ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేసిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఇండస్ట్రీకి దూరం అయ్యి చాలా కాలం అయినా అప్పుడప్పుడు ఈమె ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో కనిపించిన ప్రతిసారి ఈమె గురించిన చర్చ జరుగుతూ ఉంటుంది. వేదం సినిమాలో భలే నటించింది, మిరపకాయ్‌లో భలే అందంగా ఉంటుంది... ఇలా దీక్షా గురించి ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో చర్చ జరగడం మనం చూస్తూ ఉంటాం. అయితే ఈసారి ఈమె ఒక యూకే బేస్డ్ గేమింగ్ కంపెనీకి డైరెక్టర్‌గా నియమితం కావడం గురించి చర్చ జరుగుతోంది. బిజినెస్ మేనేజ్‌మెంట్ లో పట్టా పొందిన ఈమెకు ఆ ప్రముఖ గేమింగ్ కంపెనీ ఈ ఆఫర్‌ను ఇచ్చిందని సమాచారం అందుతోంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టిన సమయంలో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించిన దీక్షా సేథ్‌కి లక్ కలిసి రాకపోవడంతో ఆఫర్లు రాలేదు. దాంతో మెల్ల మెల్లగా ఇండస్ట్రీకి దూరం అయ్యి, ఇలా వ్యాపారంపై దృష్టి పెట్టింది. తండ్రి ఉద్యోగరీత్యా దీక్షా సేథ్ దేశంలోని చాలా ముఖ్య పట్టణాల్లో జీవనం సాగించింది. చెన్నై, ముంబై, కోల్‌కత్తా, రాజస్థాన్, గాంధీ నగర్ ఇలా చాలాచోట్ల దీక్షా విద్యాభ్యాసం సాగింది. ముంబైలో కాలేజ్ చేసే రోజుల్లో సముద్రపు పురావస్తు శాస్త్రంపై ఆసక్తితో అది చదవాలని నిర్ణయించుకుంది. సముద్రపు అడుగు భాగంలో ఏం ఉంటాయి అనేది తెలుసుకోవాలి అనేది ఆమెకు ఆసక్తి. కానీ అనూహ్యంగా ఒక ఫ్యాషన్ షోలో పాల్గొనడం వల్ల టాప్ 10లో నిలిచింది.

అక్కడ నుంచి ఫ్యాషన్ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండటం, మోడలింగ్ చేయడం, యాడ్స్‌లో నటించడం వల్ల దర్శకుడు క్రిష్ దృష్టిలో పడి వేదం సినిమాలో అవకాశం దక్కించుకుంది. టాలీవుడ్ సినిమాల్లోనే కాకుండా కోలీవుడ్, బాలీవుడ్ సినిమాలను సైతం చేసిన ఈ అమ్మడు ఇప్పుడు కెరీర్‌లో కొత్త జర్నీ మొదలు పెట్టింది. సినిమా కెరీర్‌కు విరామం ఇచ్చిన తర్వాత దీక్షాసేథ్ స్పెయిన్‌లోని ఐఇఎస్ఇ బిజినెస్ స్కూల్ నుంచి ఎంబిఏ పూర్తి చేశారు. ప్రస్తుతం యూకేకు చెందిన ఒక గేమింగ్ కంపెనీలో Director - Business Development & Strategic Partnerships గా పనిచేస్తున్నారు.లింక్డ్ఇన్‌లో దీక్షా ఈ మార్పును deliberate shiftగా వివరించారు. దశాబ్దకాలంగా మీడియా, ఆడియన్స్, బ్రాండ్స్‌తో పని చేసిన అనుభవాన్ని ఇప్పుడు బిజినెస్‌లో ఉపయోగించాలనే లక్ష్యంతో ఈ కొత్త దారిని ఎంచుకున్నట్లు తెలిపారు. ఇక్కడ అయినా ఆమె జర్నీ సాఫీగా సాగాలని ఆమెను అభిమానించే వారు కోరుకుంటూ సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# మెగా 'విశ్వంభర'.. లైన్ క్లియర్ అయినట్లేనా?



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్‌లో రూపొందుతున్న సోషియో ఫాంటసీ మూవీ విశ్వంభర.. మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో రూపొందుతున్న ఆ సినిమా మొదట అనుకున్న డేట్‌కు థియేటర్స్‌లో రిలీజ్ అవ్వలేదన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా గ్రాఫిక్స్, విజువల్ ఎఫెక్ట్స్ క్వాలిటీపై వచ్చిన విమర్శలు కారణంగా మేకర్స్ పలుమార్లు వాయిదా వేశారు. అయితే 2026 సమ్మర్‌లో సినిమా రిలీజ్ చేస్తామని హామీ ఇచ్చిన మెగాస్టార్.. ఇప్పుడు విశ్వంభర విషయంలో ఫైనల్ డిసిషన్ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నిజానికి విశ్వంభరపై స్టార్టింగ్ నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో ఇదొక విభిన్నమైన ఫాంటసీ మూవీ కావడంతో, సినిమాను ఇంటర్నేషనల్ రేంజ్‌లో విజువల్స్‌తో తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో మేకర్స్ సమయం తీసుకుంటున్నారు. ముందు సిద్ధమైన గ్రాఫిక్స్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వాటిని పూర్తిగా మార్చి, కొత్తగా రీ డిజైన్ చేయాలనే నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అందుకే దాదాపు ఏడాదికిపైగా పోస్ట్ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికీ దాదాపు వీఎఫ్ఎక్స్ పనులు కంప్లీట్ అయినట్లు తెలుస్తున్నప్పటికీ.. రిలీజ్ మరింత ఆలస్యం చేస్తే నిర్మాతకు ఆర్థికంగా భారీ భారం పడే అవకాశం ఉందని మూవీ టీమ్ భావిస్తోంది! భారీ సెట్లు, లాంగ్ టైమ్ షూటింగ్, టెక్నికల్ వర్క్ కారణంగా ఇప్పటికే ఖర్చులు పెరిగిపోయాయని సమాచారం. దీంతో విడుదలను ఇంకా లేట్ చేయడం కన్నా, ఇప్పుడు సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం మంచిదని నిర్ణయానికి వచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో మెగాస్టార్ స్వయంగా టీమ్‌తో రీసెంట్‌గా సమావేశమై పరిస్థితిపై చర్చించి.. రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇచ్చారట. అందుకే ఇప్పుడు ఉగాది పండుగ సందర్భంగా మార్చి 19న అధికారికంగా విశ్వంభర మూవీ విడుదల తేదీ ప్రకటించే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఫాంటసీ, అడ్వెంచర్, ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న విశ్వం భర మూవీ అన్ని వర్గాల ఆడియన్స్‌ను కచ్చితంగా నచ్చేలా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటికే రిలీజైన పోస్టర్లు, అప్డేట్లు సినిమాపై ఆసక్తి మరింత పెంచాయి. ఏదేమైనా ఎన్నో అడ్డంకులు దాటుకుంటూ వచ్చిన విశ్వంభరకు రిలీజ్ టైమ్ దగ్గర పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉగాది రోజున విడుదల తేదీ ప్రకటన వస్తున్నట్లు తెలుస్తోంది. మరి మూవీ ఎప్పుడు రిలీజ్ అవుతుందో వేచి చూడాలి.

# జిల్లాలో పర్యటించనున్న శ్రీ వాగ్దేవి కళా పీఠం వ్యవస్థాపకులు శ్రీనివాసమూర్తి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ రచయిత సాహితీ వేత్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గిడుగు రామ్మూర్తి పురస్కార గ్రహీత ఢిల్లీకి చెందిన శ్రీ వాగ్దేవి కళా పీఠం వ్యవస్థాపకులు శ్రీనివాసమూర్తి ఈ నెల 24న విజయనగరం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 24వ తేదీ ఉదయం 10 గంటలకు గురజాడ పాఠశాలలో జరుగనున్న కార్యక్రమంలో తెలుగు భాషా ప్రాశస్త్యం అనే అంశంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు.


# మహిళలకు అండగా వన్ స్టాప్ సెంటర్






**పాచిపెంట, (రాజధాని వార్తలు):** పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం వేటగాని వలస జి టి డబ్ల్యు ఏ ఎస్ మరియు పాంచాలీ జడ్పీహెచ్ స్కూల్‌లో పిల్లలకు గౌరవ కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థిని, విద్యార్థులకు వ్యక్తిగత అవగాహన కార్యక్రమం నిర్వ హించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు వలన కలిగే నష్టాలు మరియు నివారణ ఫోక్సో యాక్ట్ పై అవగాహన, టీనేజ్ గర్భాల వలన కలిగే నష్టాలు, పోలీస్ సేవలు, మహిళలపై జరిగే వేధింపులు, వన్ స్టాప్ సెంటర్ సేవలు మిషన్ వాత్సల్య సేవలు కోసం అవగాహన కార్యక్రమం నిర్వ హించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వన్ స్టాప్ సెంటర్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్ మరియు పారా మెడికల్ మరియు బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ మరియు ఔట్రీచ్ వర్కర్ మరియు సోషల్ వర్కర్ పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా స్కూల్ పిల్లలకు బాల్య వివాహాలు కోసం మరియు బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడం కోసం పిల్లలతో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. చైల్డ్ మ్యారేజెస్ ప్రొహిబిషన్ ఆక్ట్ 2006 గూర్చి, పోక్సో చట్టం కోసం చైల్డ్ లేబర్ కోసం వివరంగా చెప్పడం జరిగింది. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్ ఫ్రీ నెంబర్, మహిళ హెల్ప్ లైన్ నెంబర్ 181 కోసం తెలియజేయడం జరిగింది. వన్ స్టాప్ సెంటర్ సేవలు (వైద్య, న్యాయ, రక్షణ, కౌన్సిలింగ్, ఆశ్రయం) కోసం బాలికలకు పర్సనల్ హైజెనిక్ కోసం, యూవీ కోసం, సైబర్ నేరాలు, రక్తహీనత కోసం, అలాగే వ్యక్తిగత ముస్తాబు గూర్చి తెలియజేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది, జిల్లా బాలల సంరక్షణ విభాగం నుండి పిఒఐసి ప్రసాదరావు, సోషల్ వర్కర్ టి పి నాయుడు, ఓ ఆర్ డబ్ల్యు అనిల్ మరియు వన్ స్టాప్ సెంటర్ నుండి సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ శాంతి కుమారి పారామెడికల్ వర్కర్ కళ్యాణి సుమారు 350 మంది పిల్లలతో యొక్క కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఫోన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ శాంతి కుమార్ తెలిపారు.

# నృత్య కౌముది, నాట్య విశారద అన్నా నేహా థామస్




**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంకు చెందిన ప్రముఖ నర్తకి కుమారి అన్నా నేహా థామస్ జిల్లా కీర్తి పతాకాన్ని ప్రపంచం నలుదిశలా రెపరెపలాడిస్తున్నారు. భావం, రాగం, తాళం మరియు నృత్యం యొక్క అద్భుత సమ్మేళనం "శరీరం, మనసు, ఆత్మ సమన్వయం – భరతనాట్యం." నాట్యం ఆత్మ యొక్క భాష. ప్రతి అడుగు ఒక ప్రార్థన, ప్రతి ముద్ర ఒక కావ్యం. భ' అంటే భావం, 'ర' అంటే రాగం, 'త' అంటే తాళం – ఈ మూడింటి కలయికే భరతనాట్యం. నృత్యం లయబద్ధమైన కదలిక. దానికి మూలం భావ వ్యక్తీకరణ. నృత్యం భాషకు అతీతమైంది. నృత్యం ఒక సంస్కృతి. భరతనాట్యం దక్షిణ భారతదేశంలో నాట్య శాస్త్రం రచించిన భరతముని పేరుతో పుట్టి, ప్రసిద్ధి గాంచిన ఒక శాస్త్రీయ నృత్య విధానం. అటువంటి భరతనాట్యంతో ప్రేక్షకులును మైమరపిస్తున్నారు. నాట్యం నటరాజ వరప్రసాదం నాట్యమే వేదంగా నిజజీవన నాదంగా తమ జీవితాలను నాట్యానికి అంకితమిచ్చిన కళాకారులు ధన్య జీవులు. పండిత, పామర రసజ్ఞ జనామోదం నాట్యం .అటువంటి భరతనాట్య ప్రక్రియలో విశేషంగా రాణిస్తున్నారు. 2002 అక్టోబర్ 3వ తేదీన జన్మించిన అన్నానేహా థామస్ తల్లి తిసియమ్మ, తండ్రి ఇ.జి.థామస్ కుట్టి. ఆమె రాజాం జిఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎం టెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. లెక్కకు మిక్కిలిసార్లు రాష్ట్ర స్థాయి నాట్య పోటీలలో ప్రథమ స్థానాన్ని సాధించారు. విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఉత్తమ విద్యార్థినిగా బంగారు పతకాన్ని సాధించారు. ఏలూరుకు చెందిన అభినవ నృత్య భారతి సంస్థ ఆమెకు నృత్య కౌముది అవార్డును ప్రదానం చేసారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ కల్చరల్ రిలేషన్స్, విదేశీ వ్యవశారాల శాఖ ఆధ్వర్యంలో 2022 జూన్ 29వ తేదీ నుండి జూలై 22వ తేదీ వరకు అమెరికాలో వందేభారత్ మిషన్ పేరిట జరిగిన ఉత్సవంలో తన నాట్యప్రదర్శన గావించి ప్రశంసలు పొందారు. ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో వరల్డ్ కల్చరల్ ఎక్స్‌పో 2025 పేరిట జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ ఉత్సవంలో కూచిపూడి నృత్య ప్రదర్శన గావించి విజయనగరం ఖ్యాతిని ఇనుమడింపచేసారు. దూరదర్శన్ నిర్వహించే కూచిపూడి, భరతనాట్యం ఆడిషన్స్‌లో బి గ్రేడ్ సాధించారు. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన 2026 రిపబ్లిక్ వేడుకల్లో భరతనాట్యాన్ని ప్రదర్శించారు. 2010 నుండి 2015 వరకు విజయనగరంకు చెందిన రవికుమార్ వద్ద శిక్షణ పొందారు. 2015 నుండి 2020 వరకు మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో దామరాజు హిమబిందు శిక్షణలో భరతనాట్యంలో డిప్లమో పూర్తిచేసారు. ప్రస్తుతం కూచిపూడి, భరతనాట్యంలో శ్రీకాకుళం శివశ్రీ నృత్య కళానికేతన్‌కు చెందిన డాక్టర్ ఆర్ శ్రీకాంత్ వద్ద శిక్షణ పొందుతున్నారు. తన ప్రజ్ఞాపాటవాలతో నృత్యరంగంలో విశేషంగా రాణిస్తూ విజయనగరం ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్న అన్నా నేహా థామస్‌కు 2026 ఫిబ్రవరి 20వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య నుండి నటరాజ పురస్కారాన్ని సాధించారు. రానున్న రోజుల్లో విశేషంగా రాణించి జిల్లా కీర్తిని ఇనుమడింప చేయాలని కోరుకుందాం.

# పింఛన్లు, తాగునీటి సమస్యలపై మాలేపాటి వద్ద ప్రజల వినతి



**కావలి, (రాజధాని వార్తలు):** దగదర్తి మండలంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు స్వగృహం వద్ద సోమవారం ప్రజలు తమ సమస్యలను వినిపించారు. ఈ సందర్భంగా మాలేపాటి రవీంద్రనాయుడు ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యలను ఓర్పుతో విని, వాటిని అర్జీల రూపంలో స్వీకరించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు మాలేపాటి లోకేష్, మండల సీనియర్ నాయకుడు కంచర్ల సునీల్ కూడా పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రాంతీయ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా రాబోయే వేసవి కాలంలో తాగునీటి కొరత నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, కొత్త పింఛన్ల మంజూరు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పేదల అభ్యున్నతికి మాలేపాటి కుటుంబం ఎప్పటికీ కట్టుబడి పనిచేస్తుందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

## - ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి








**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఈ నెల 28న ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి చీపురుపల్లి మండలం రావివలస గ్రామానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నారని, వారి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండి ఎవరికి కేటాయించిన విధులను వారు సక్రమంగా, సమన్వయంతో నిర్వహించాలని అన్నారు. సోమవారం కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ముఖ్యమంత్రి గతసారి పింఛన్ల పంపిణీకి దత్తి వచ్చేటప్పుడు చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని, ఈసారి ఎటువంటి పొరపాటుకీ తావివ్వకూడదని అన్నారు. ప్రధానంగా బందోబస్తు, శాంతి భద్రతల విషయాలు పోలీసు శాఖ వారు చూసుకోవాలని తెలిపారు. హెలిపాడ్ , వేదిక వద్ద ఏర్పాట్లు, అన్ని డిపార్ట్మెంట్ల సమన్వయంతో చీపురుపల్లి ఆర్.డి.ఓ చూసుకోవాలని, అలాగే వాహనాలకు, స్టాఫ్ కు అవసరమగు డ్యూటీ పాస్‌లను జారీ చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో రహదారులన్నీ గుంతలు లేకుండా చూడాలని, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, శాఖాధికారులకు ఆదేశించారు. ఎన్.టి.ఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కోసం ముఖ్యమంత్రి ఇళ్ళవద్దకు వెళ్లి అందిస్తారని, అక్కడ లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారని, అందుకు అవసరమగు ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండేలా చూడాలని డి.ఆర్.డి.ఏ పి.డికు ఆదేశించారు. ముఖ్యమంత్రి సెక్యూరిటీ టీమ్ కు భోజనం, నివాస ఏర్పాట్లను విజయనగరం ఆర్.డి.ఓ పర్యవేక్షించాలన్నారు. అలాగే ప్రజా వేదిక వద్ద 3 వేల మందికి సీటింగ్ ఏర్పాట్లు, పోలీస్ వారి సహకారంతో ఆర్.డి.ఓ, విజయనగరం చూడాలన్నారు. మార్గదర్శి, అర్హులైన బంగారు కుటుంబాలతో, ముఖ్యమంత్రితో ముఖాముఖి ఏర్పాటు చేయాలని ముఖ్య ప్రణాళికాధికారికి సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యేంత వరకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, విద్యుత్ శాఖ అధికారులు వేదికల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలని విద్యుత్ శాఖ ఎస్.ఈకి ఆదేశించారు. మంచి కండిషన్‌లో ఉన్న అంబులెన్స్ వాహనాలు, అత్యవసర వైద్యానికి వైద్యులు, మందులతో వేదిక సమీపంలో సేఫ్ హౌస్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారికి ఆదేశించారు. కాన్వాయ్ వాహనాలను ఏర్పాటు చేయాలని డి.టి.ఓకు, ఫైర్ సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఫైర్ అధికారికి,తాగు నీటి సరఫరా ఉండేలా చూడాలని ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారికి ఆదేశించారు. ఫుడ్ ఏర్పాట్లను చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారికి, పారిశుధ్యం, టాయిలెట్లు ఏర్పాటు విజయనగరం మున్సిపల్ కమిషనర్కు, డి.పి.ఓకు ఆదేశించారు. సింగల్ ఆఫీసర్ కాంటాక్ట్ కోసం సి.పి.ఓను సంప్రదించాలని, అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జె.సి సేదు మాధవన్, డి.ఆర్.ఓ మురళి, సి.పి.ఓ బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బోద వ్యాధి నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో నిర్వహిస్తున్న బోద వ్యాధి నివారణ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను అదేశించారు. జాతీయ ఆరోగ్య మిషన్ అడిషనల్ సెక్రటరీ ఆరాధన పట్నాయక్ సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో బోద వ్యాధి నివారణ ప్రత్యేక కార్యక్రమంలో లక్ష్యం మేరకు అందరికీ డిఇసి మాత్రలు పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. గుర్ల మండలంలో ఫైలేరియా కేసులు వెలుగు చూడడంతో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఇప్పటివరకు 5516 మందికి డిఇసి పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన 7,710 మందికి కూడా రానున్న మూడు రోజుల్లో పంపిణీ పూర్తి చేయాలన్నారు.

జిల్లాలో బోద వ్యాధిని పూర్తిగా నివారించేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఎం. సింహాచలం, అదనపు డి.ఎం అండ్ హెచ్.ఓ డా. కె.రాణి పాల్గొన్నారు.

# నాయుడుపేట-వెంకటగిరి స్వర్ణముఖి నదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలి

## - సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట పట్టణ సమీపంలోని స్వర్ణముఖి నదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చారు. స్వర్ణముఖి నదిపై నాయుడుపేట, వెంకటగిరి పట్టణాలను అనుసంధానం చేస్తూ గతంలో లో లెవెల్ బ్రిడ్జి నిర్మించినట్లు తెలిపారు. మేనకూరు సెజ్‌లోని పరిశ్రమలకు నిత్యం ఈ లో లెవెల్ బ్రిడ్జిపై సుమారు 300 భారీ వాహనాలతో పాటు కార్మికులను తరలించే బస్సులు, ఇతర వాహనాలు వెళుతుంటాయని తెలిపారు. భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని సభ దృష్టికి తీసుకు వెళ్లారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో అనేక పరిశ్రమలు వస్తున్నాయని అన్నారు. పరిశ్రమలకు వెళ్లే వాహనాలకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఈ ప్రాంతంలో స్వర్ణముఖి నదిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ఆర్ అండ్ బి శాఖ మంత్రి వీలైనంత త్వరగా బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు : ఎస్.ఐ యు.మహేష్





**బొండపల్లి /గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని స్థానిక సాయి సిద్ధార్థ కళాశాల పరీక్షా కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు బొండపల్లి ఎస్.ఐ యు.మహేష్ విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిగా పోలీస్ పర్యవేక్షణ ఉంటుందని ఎస్.ఐ యు.మహేష్ అన్నారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి మాల్ ప్రాక్టీస్ గాని, అవాంఛనీయ సంఘటనలు గాని జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదని విద్యార్థులకు పరీక్షా కేంద్రం వద్ద సూచించినట్లు ఎస్.ఐ యు.మహేష్ అన్నారు. ముఖ్యంగా పరీక్షలకు ఎవరైనా విద్యార్థులు రవాణా సౌకర్యం లేక ఆలస్యం అవుతారేమో అన్న కోణంలో కూడా ఆలోచించి నగరంలోని జంక్షన్ల వద్ద మొబైల్ పార్టీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్.ఐ యు.మహేష్ అన్నారు. సాయి సిద్ధార్థ కళాశాలల కరస్పాండెంట్ సీరం రెడ్డి చంద్రశేఖర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో సోమవారం నాడు 411 మంది విద్యార్థులు పరీక్ష వ్రాశారని, 23 మంది హాజరు కాలేదని ఆయన అన్నారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా తాగునీరు, పరీక్షా కేంద్రంలో లైట్లు, ఫ్యాన్లు వంటి కనీస సౌకర్యాలు, విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచినట్లు కరస్పాండెంట్ చంద్రశేఖర్ తెలియజేశారు.

# డిమాండ్ల సాధనకై అంగన్వాడీల ర్యాలీ

**- పెరుగుతున్న నిత్యావసర ఖర్చులు, విద్య, వైద్య ఖర్చుల నిమిత్తం అంగన్వాడీల జీతాలు పెంచాలి : సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి**







**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఆమోదయోగ్యమైన తమ డిమాండ్ల సాధనకై అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నలుపు చీరలు ధరించి సోమవారం నాడు గజపతినగరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా గజపతినగరం సచివాలయం దగ్గర గల మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సి.ఐ.టి.యు జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ తమ డిమాండ్లను తెలియజేశారు. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా పెరిగిన ధరలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేల మంది మినీ వర్కర్లు ఉంటే నాలుగు వేల మంది మినీ వర్కర్లను మాత్రమే మెయిన్ వర్కర్లుగా చేశారని మిగిలిన రెండు వేల మంది మినీ వర్కర్లను కూడా మెయిన్ వర్కర్లుగా చేయాలని లక్ష్మి డిమాండ్ చేశారు. అదేవిధంగా 2023వ సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ అంగన్వాడీ యూనియన్లు 42 రోజులు పాటు సమ్మె చేస్తున్న సందర్భంగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మీకు న్యాయం చేస్తామని అంగన్వాడి యూనియన్ల సమ్మె చేస్తున్న శిబిరాల వద్దకు కూటమి నాయకులు వచ్చి హామీ ఇచ్చారని లక్ష్మి విలేకరులతో అన్నారు. వైసీపీ ప్రభుత్వం 10,500/- ఉన్న అంగన్వాడీల జీతాన్ని వెయ్యి రూపాయలు పెంచి 11500/- చేసిందని లక్ష్మి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా తమ జీతాలను పెంచలేదని పెరుగుతున్న నిత్యావసర ధరలు, విద్య, వైద్య ఖర్చులను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం తమ జీతాలను పెంచాలని లక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ-అభివృద్ధి పథకాలు అందడం లేదని ఆమె వాపోయారు. తెలంగాణ ప్రభుత్వం వలే మినీ వర్కర్లందర్నీ మెయిన్ వర్కర్లుగా చేయాలని లక్ష్మి డిమాండ్ చేశారు. మే నెల అంతా వేసవి సెలవులు ఇవ్వాలని, ఎండ తీవ్రతను బట్టి ఒంటి పూట బడులు మాత్రమే పెట్టాలని, హెల్పర్ల ప్రమోషన్ విషయంలో రాజకీయ జోక్యం ఉండకుండా చూడాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎం సుభాషిని, సెక్టార్ లీడర్లు ఎస్వీ పద్మ కళ, రాములమ్మ, బి.సుజాత, రవణమ్మ, నారాయణమ్మ, సూర్యకుమారి, లక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**- పరీక్షలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి**





**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షా గదులను సందర్శించి, విద్యార్థులకు కల్పించిన వసతులను స్వయంగా పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల నిఘా ఉండాలని, మాల్ ప్రాక్టీస్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, గదుల్లో వెలుతురు, ఫ్యాన్లు సరిగ్గా ఉండేలా చూడాలని ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలని, నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక ఏఎన్ఎం మరియు ప్రాథమిక చికిత్స కిట్ అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన సౌకర్యాల పట్ల విద్యార్థులతో ముచ్చటించి వివరాలు తెలుసుకున్నారు. ఈ తనిఖీలో కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కె.ఎల్.పురంలోని శ్రీ లక్ష్మీగణపతి జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని ఆయన సందర్శించి, పరీక్షల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న గదులను సందర్శించి, వారికి కల్పించిన వసతులపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇంటర్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. మాల్ ప్రాక్టీస్‌కు ఎక్కడా అవకాశం లేకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వెలుతురు, ఫ్యాన్లు వంటి కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పరీక్షల నిర్వహణలో ఏవైనా లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

# పి.జి.ఆర్.ఎస్. వినతులు గడువులోగా పరిష్కరించాలి

**- ఆడిట్ రిపోర్టులు పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలి - ఏకకృత కుటుంబ సర్వే వేగవంతం చేయాలి - అన్నాకాంటీన్లలో ఆహార నాణ్యత పెరగాలి - మున్సిపల్, బి.సి. హాస్టల్స్ పనితీరు మెరుగు పడాలి - అధికారులు తప్పనిసరిగా నెలకు 4 సచివాలయాలను సందర్శించాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** పి.జి.ఆర్.ఎస్.వినతులు గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలక్టరు ఎస్.రాం సుందర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఆడిట్ రిపోర్టులు పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని, ఏకీకృత కుటుంబ సర్వే వేగవంతం చేయాలని, అన్నా కాంటీన్లలో ఆహార నాణ్యత పెరగాలని అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్, ఈ.పి.టి.ఎస్, ఐ.వి.ఆర్.ఎస్, ఇంటర్ డిపార్టుమెంటల్ అంశాలపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ వినతులను రెండు పూటలా లాగిన్‌లో తనిఖీ చేయాలని రెవిన్యూ పిటిషన్లుకు సంబంధించి తహశీల్దార్లు వ్యక్తిగతంగా హాజరు కావాలని అన్నారు. వినతులకు సంబంధం లేని, అనవసరమైన సమాధానాలు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఐ.వి.ఆర్.ఎస్‌లో తమ శాఖలకు సంబంధించిన ప్రజాభిప్రాయంపై పోజిటివ్ రెస్పాన్సు రావాలని, ఆయా శాఖల వారు తమ పనితీరును సరిదిద్దుకోవాలని తెలిపారు. పథకాల అమలులో ఆలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని స్పష్టం చేసారు. అధికారులు తప్పనిసరిగా నెలకు 4 సచివాలయాలను సందర్శించాలని, ఏకకృతి కుటుంబ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ర్యాంకింగ్ మెరుగుపడాలని, ముఖ్యంగా అన్నా కాంటీన్లు, బిసి వెల్ఫేర్ హాస్టళ్లు, ఇరిగేషన్, హెల్త్, ట్రైబల్ వెల్ఫేర్, పౌర సరఫరాల తదితర శాఖలు తమ పని తీరు మెరుగుపరచుకోవాలని, అప్పుడే జిల్లాకు మంచి రాంక్ వస్తుందని తెలిపారు. ఈ.పి.టి.ఎస్ లాగిన్‌లో అధికారులంతా వారి కార్యాలయానికి అందిన, కార్యాలయం నుండి పంపిన ప్రతులను ఏ రోజుకారోజు అప్లోడ్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, డి.ఆర్.ఓ మురళి, సి.పి.ఓ బాలాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నిత్య చైతన్యశీలి ఎస్వీ రాఘవేంద్రరావు సహస్ర చంద్ర దర్శన పుస్తకావిష్కరణ



**రాజమహేంద్రవరం, (రాజధాని వార్తలు):** రాజమహేంద్రవరం నగరంలోని వై జంక్షన్ వద్ద గల ఆనం రోటరీ హాల్‌లో పద్య తిలక ఎస్వీ రాఘవేంద్రరావు సహస్ర చంద్ర దర్శన మహోత్సవం ఎందరో సాహితీ రంగ ప్రముఖులు, పండితుల సమక్షంలో. అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి సాహితీ గౌతమి అధ్యక్షుడు ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ విశ్రాంత చీఫ్ జనరల్ మేనేజర్ ఏ విజయకుమార్ అధ్యక్షత వహించారు. కేంద్రీయ విద్యాలయం విశ్రాంత ఆచార్యుడు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి వేదాశీస్సులు అందజేశారు. పవిత్రమైన ఈ మహాసభలో 'పద్యకవి తిలకో డాక్టర్ సంగాడి వీర రాఘవేంద్రరావుచే రచింప బడిన 12 అమూల్య పుస్తకాలను ప్రముఖులు ఆవిష్కరించారు. 'ఉగ్రశాంతి' (పద్యఖండ కావ్యం), 'కరోనా కథ' (పద్య కావ్యం), పుడమి తల్లి (పద్య కావ్యం), 'శ్రీవారి బ్రహ్మోత్సవాలు-వాహన వైభవాలు' (ప్రత్యక్ష వ్యాఖ్యానం). ద్రాక్షారామ క్షేత్ర సాహిత్య సమీక్ష' (పి హెచ్ డి), 'కబీరు బోధనామృతము' (కబీరు దోహాలకు ఆటవెలదులలో అనువాదము భావార్థోదాహరణ సహితము), ''ఆకాశవాణి' (ప్రసంగఝరి), 'ప్రసంగ తరంగిణి' ప్రథమ భాగము (వ్యాస సంపుటి), ప్రసంగ తరంగిణి-ద్వితీయ భాగము (వ్యాస సంపుటి), ''గోష్ఠి పత్రం స్రవంతి', సాహితీ మంజూష, 'మన సిక్కిం ' రచనలను అతిథులు ఆవిష్కరించారు. సినీ గేయ రచయిత రసరాజు, డాక్టర్ అరిపిరాల నారాయణ రావు, కడిమెళ్ల వరప్రసాద్, ధూళిపాళ మహాదేవమణి, ఎస్వీ గంగిరెడ్డి, తాతా సందీప్ శర్మ, తలారి వాను, బీహెచ్ వీ.రమాదేవి, ఓలేటి బంగారేశ్వర శర్మ, మధునామూర్తి, సాధనాల వెంకట స్వామి నాయుడు, కృష్ణంరాజు, ప్రయాగ సుబ్రహ్మణ్యం తదితరులు పుస్తకా విష్కరణ, సమీక్షలో పాలుపంచుకున్నారు.

# ఆంధ్ర రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విదేశాలలో ఉద్యోగ అవకాశాలు

**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** గౌరవ ముఖ్యమంత్రివర్యులు నిరుద్యోగి యువత కోసం సాంకేతికతతో కూడిన ఉద్యోగాలను ఇతర దేశాలలో ఇస్తున్నారు. ఇందులో భాగంగా ట్రాన్స్మిషన్ లైన్ టెక్నీషియన్ ఉద్యోగము జర్మనీలో చేయుటకు స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం అనుభవము ఒక సంవత్సరం పైబడి వయస్సు 43 సంవత్సరములు వరకు ఉద్యోగ అర్హత ఐటిఐ డిప్లమా ఏదయినా డిగ్రీ అలాగే లాంగ్వేజ్ స్కిల్స్‌లో బి వన్ లెవెల్ ఆఫ్ ఇంగ్లీష్,హిందీ. ఈ ఉద్యోగం కోసం మన కరెన్సీ రూపంలో శాలరీ 3,19,300 రూపాయలు ప్రతినెలా ఇవ్వబడును. ఈ ఉద్యోగం కొరకు కాంట్రాక్టు రెండు సంవత్సరములు గరిష్టంగా ఇంటర్వ్యూ ఆన్లైన్ ద్వారా నిర్వహించబడును. అలాగే పైన తెలిపిన ఉద్యోగం కోసం ప్రాసెస్ చేయడం కోసం చార్జెస్ రూపంలో రెండు లక్షల పది వేల రూపాయలు యువత పే చేయవలసి ఉంటుంది. దీనిని మీయొక్క శాలరీలో రెండు దఫాలుగా తీసుకోవడం జరుగుతుంది. అలాగే ఉద్యోగం కోసం భోజన వసతి,వీసా, విమాన టికెట్టు అంతా యువతే భరించవలసి ఉంటుంది. అని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి సాయి కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరములకు మీరు ఈ క్రింది ఇచ్చిన ఫోన్ నెంబర్ను ఫోన్ నెంబర్ను సంప్రదించగలరు. వెంకటరమణ 70 320 60 773.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

## RAJADHANIVARTALU.COM
## 9440662699









# అనాథాశ్రమంలో సేవా కార్యక్రమాలు

### - ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్

**బొండపల్లి/గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని ఓంపల్లి గ్రామంలో గల శాంతి నివాస్ అనాథాశ్రమంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నాడు పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. సోమవారం నాడు ఫౌండేషన్ సభ్యులు కర్రి జస్వంత్ – దినేష్‌లు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శాంతి నివాస్‌లో ఉన్న పిల్లలకు బియ్యం, పోషక విలువలు కోసం గుడ్లు, స్నాక్స్ ఐటమ్స్‌ను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయి కుమార్, రేవంత్, సభ్యులు ఆషిక్, లక్ష్మణ్, శ్యామ్, రవి, తదితరులు పాల్గొన్నారు.




# ఫ్యాక్టరీ కాంప్లెక్స్ స్థలాల ధరలు తగ్గించాలి : సిపిఎం

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** "ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ" స్థలాల ధరలు పాత ధరలకే నిర్ణయించాలని సిపిఎం పట్టణ కమిటీ పెద్దాపురం ఆర్డీవో అధికారులకు వినతి అందించారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరిని స్వయం ఉపాధి, వ్యాపారం వైపు ప్రోత్సహించే ఉద్దేశంతో పెద్దాపురం నియోజకవర్గానికి ఇండస్ట్రీయల్ పార్క్, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని, అయితే ప్లాట్ ధరలు పెంచుతూ ప్రభుత్వం ప్రకటించడం దారుణమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆర్‌డివో కార్యాలయంలో దీనిపై వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపిఐసిసి పరిధిలో పెద్దాపురంలో 29 ఎకరాల్లో మిని స్మాల్ స్కేల్ ఇండస్ట్రీని పార్కు అభివృద్ధి చేస్తున్నామని ప్రకటించారన్నారు. 300 చదరపు మీటర్ల చొప్పున 175 ప్లాట్లను సిద్ధం చేస్తున్నట్టు ప్రతికల్లో ప్రకటనలు కూడా ఇచ్చిన ప్రభుత్వం, ఎస్సీ, ఎస్టీలకు 39 రిజర్వ్ చేసినట్టు, 85 ప్లాట్లలో యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తూ నిర్ణయించారన్నారు. వీటి ధర చదరపు మీటరు 1500 రూపాయలలోపు అని కార్యాల యంలో తెలిపారని, పరిశ్రమ కోసం 291 మంది ధరఖాస్తు చేసుకున్నారని, అందువల్ల ప్లాట్ రేటు పెంచడం జరుగుతుందని ముఖాముఖి సమావేశంలో తెలిపారన్నారు. అప్పుడే అనేక మంది లబ్దిదారులు రేటు పెంచడం అన్యాయమని, ప్రకటించిన రేటుకే ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. చదరపు మీటరు రూ. 5 వేలు దాటిందని తీసుకుంటారా వద్దా అని ప్రస్తుతం అడుగుతున్నారన్నారు. ఒక ప్రక్క కూటమి ప్రభుత్వం బాడా వ్యాపారులకు 99 పైసలకు ఎకరం ఇస్తామని ప్రచారం చేసుకుంటూ మరోపక్క చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుందామనుకుంటున్న మధ్యతరగతికి మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం దారుణం అన్నారు. కావున గతంలో ప్రకటించిన రేటుకే లబ్ధిదారులకు స్థలాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి డి క్రాంతి కుమార్, సిరిపురపు శ్రీనివాస్, కూనిరెడ్డి అప్పన్న, నెక్కల నరసింహమూర్తి, గడిగట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan